ANDHRA JYOTI, Vijayawada Regd No. H. 543

ఉదయం

# ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

Telephone: 4343

సంపుటి 9 : సంచిక 134 విజయవాడ, నవంబరు 16, 1968 శనివారం | 6 పేజీలు : 12 పైసలు

చందా రేట్లు

| | పేజెంట్ ద్వారా రు. పై. | పోస్టు ద్వారా రు. పై. |
|---|---|---|
| ఒక మాసానికి | 3-75 | 5-00 |
| మూడు మాసాలకు | 11-25 | 15-00 |
| ఆరు మాసాలకు | 22-50 | 30-00 |
| సంవత్సరానికి | 45-00 | 60-00 |

సర్క్యులేషన్ మేనేజర్

ఆంధ్రజ్యోతి, పో.బా.నెం. 334 విజయవాడ-2.




# కేంద్రం నుంచి రాష్ట్రానికి అదనంగా 330 లక్షల గ్రాంటు

## ఐదవ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల దృష్ట్యా రాష్ట్రాలకు 91 కోట్లు హెచ్చుగా లభ్యం

## రాష్ట్రాలు లోటు బడ్జెట్టుకు స్వస్తి చెప్పాలని సూచన

### పన్నులు, సుంకాలు పంపిణీ ప్రాతిపదికలో స్వల్పమైన మార్పులు

న్యూఢిల్లీ, నవంబర్ 15—

రాష్ట్రాలకు 1969-70 లో పన్నులు, సుంకాలలో భాగంకింద, గ్రాంటులుగాను కేంద్రం నుంచి అదనంగా 90.93 కోట్ల రూపాయలు లభించగలవు

అయిదవ ఫైనాన్స్ కమిషన్ తాత్కాలిక సిఫారసుల ప్రాతిపదికపై అదనపు సహాయం వస్తుంది.

శ్రీ మహావీర్ త్యాగి అధ్యక్షతన అయిదవ ఫైనాన్స్ కమిషన్ సమర్పించిన తాత్కాలిక సిఫారసులను, వాటిపై ప్రభుత్వ నిర్ణయాలను నేడు ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ లోకసభకు సమర్పించారు.

17 రాష్ట్రాలకు 1968-70 లో 581.35 కోట్లకు బదులు 672.28 కోట్ల రూపాయలు బదిలీని ఫైనాన్స్ కమిషన్ సిఫారసు చేసింది. దీని ప్రకారం ప్రస్తుత సంవత్సరంలో పన్నులలో భాగంకింద 55 కోట్లు, గ్రాంటులకింద 36 కోట్లు మొత్తం 90.93 కోట్ల రూపాయలు రాష్ట్రాలకు లభిస్తాయి.

అయితే ఫైనాన్స్ కమిషన్ తుది నివేదికలో సిఫారసుల మేరకు ఈ మొత్తాన్ని పద్దుబాటు చేయడం జరుగగలదనే షరతును విధించడం జరిగింది. తుది నివేదిక 1969 జూలైలో సమర్పిస్తాడు. 1969-74 సంవత్సరాలకు సంబంధించి ఆర్థిక విషయాలపై నివేదికలో సిఫారసు లుంటాయి.

1969-70 రెవిన్యూ ఆదాయవ్యయం గురించి అంచనా వేసిన సందర్భంలో కమిషన్ నూటికి అయిదు వంతుల అదనంగా ఆయా పద్దులకు కలపడం జరిగింది. ఆదరణ యోగ్యమైన అంచనాకుగాను ఈ విధంగా చేయడం జరిగింది. అయితే ఇది కమిషన్ తుది అభిప్రాయంమాత్రం కాదు.

నాల్గవ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రాలు 1968-69 లో రాజ్యాంగంలోని 275 లో నిబంధన ప్రకారం పన్నులు, సుంకాలలో భాగం కింద 440-74 కోట్లు, గ్రాంటుల కింద 140.61 కోట్ల మొత్తం 581.35 కోటు పొందుతున్నాయి.

అయితే అయిదవ ఫైనాన్స్ కమిషన్ పన్నులు, సుంకాల భాగం కింద 1969-70 సంవత్సరానికి 495.47 కోట్లు, గ్రాంటుల కింద 176.81కోట్ల మొత్తం 672.23 కోట్లు సిఫారసు చేసింది.

ఇన్కంటాక్స్, ఎక్సైజ్ సుంకాల విషయంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం వున్న వాటాల ప్రకారం పన్నులను పంచడం జరిగింది. అంతేగాని ఈ ప్రాతిపదికలో ఫైనాన్స్ కమిషన్ మార్పును సూచించలేదు.

ప్రయాణీకుల చార్జీలపై పన్నులను రద్దు చేసినందుకుగాను గ్రాంటును ఇచ్చే పద్ధతిలో ఎట్టిమార్పు వుండదని కూడా కమిషన్ సిఫారసు చేసింది. ఈ పద్దుకింద మొత్తం 16.2 కోట్లు చెల్లించడం జరుగుతున్నది.

వివిధ రాష్ట్రాలలో రైలు మార్గం విస్తీర్ణం 1966-67కు పూర్వం మూడేళ్ళపాటు నాన్ పబ్లిక్ ట్రాఫిక్ ప్రాతిపదికపై రాష్ట్రాల వాటాలు సవరించడం జరిగింది. అయితే ఇందుకు సంబంధించిన సూత్రాలను సవరించవలసిన అవసరం లేదని కమిషన్ అభిప్రాయపడింది.

ఎస్టేట్ సుంకం పంపిణీలో ప్రస్తుతం వున్న సూత్రాలను కూడా సవరించవలసిన అవసరం లేదని కమిషన్ పేర్కొన్నది.

రిజర్వు బ్యాంకు నుంచి రాష్ట్రాలు అనుమతి లేకుండా ఓవర్ డ్రాఫ్టులను నివారించేందుకు కమిషన్ పెక్కు సూచనలను చేసింది.

రాష్ట్రాల స్థాయిలో లోటు బడ్జెటు విధానం వుండరాదని కమిషన్ స్పష్టపరిచింది.

రాష్ట్రాల ప్రణాళికలు అయా రాష్ట్రాల వనరులు, కేంద్రం సహాయం మేరకు అచ్చితంగా అరిమితం చేయాలని కూడా కమిషన్ సిఫారసు చేసింది.

ఎస్టేట్ సుంకం, రైలు ప్రయాణీకుల చార్జీలపై పన్నులద్వారా వచ్చే ఆదాయంలో పంపిణీ మినహా ఘిగిలిన సిఫారసులను తుది నివేదిక దృష్ట్యా సవరించడం జరగగలదు.

తాత్కాలిక సిఫారసులు తుది నివేదికలో నిర్ణయాలను సూచించవని, పన్నులు గ్రాంటుల పంపిణీ విషయంలో నిర్దిష్టసూత్రాలకు కమిషన్ కట్టుబడివుండే విధంగా చేయజాలవని స్పష్టపరచడం జరిగింది.

తుదినివేదికలో సద్దుబాట్లకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ కమిషన్, ఇన్కమ్‌టాక్స్, ఎక్సైజ్ సుంకాలు, గ్రాంటుల పంపిణీ విషయంలో చేసిన సిఫారసులను ఆమోదించింది.

ఈ నిర్ణయం అమలుకు అవసరమైన చర్యలను గైకొంటున్నారు.

ఎస్టేట్ సుంకం, రైలు ప్రయాణీకులపై పన్ను విషయంలో కమిషన్ చేసిన తుది సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. ఈ నిర్ణయాలు 1969 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అయిదు సంవత్సరాలపాటు అమలులో వుంటాయి.

ఓవర్ డ్రాఫ్టు విషయంలో కమిషన్ సిఫారసులు "పెక్కు సమస్యలకు దారి తీసింది. అందుచేత ఆ ప్రతిపాదనలను పరిశీలించవలసి వుందని ప్రభుత్వం ప్రకటించింది.

### వివిధ రాష్ట్రాలకు గ్రాంటులు

సారీనా 140.61 కోట్ల రూపాయలు ప్రస్తుతం 11 రాష్ట్రాలు రెవిన్యూ గ్రాంటులను పొందుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్: 13.51 కోట్లు, అస్సాం: 16.52 కోట్లు, కాశ్మీర్: 6.57 కోట్లు, మద్రాసు: 6.84 కోట్లు, మైసూరు: 20.82 కోట్లు, కేరళ: 20.82 కోట్లు మధ్యప్రదేశ్: 2.70 కోట్లు, నాగభూమి: 7.07 కోట్లు, ఒరిస్సా: 29.18 కోట్లు, రాజస్థాన్ 6.73 కోట్లు, ఉత్తర ప్రదేశ్ 9.85 కోట్లు పొందుతున్నాయి.

ఫైనాన్స్ కమిషన్ 1969-70 లో 13 రాష్ట్రాలకు మొత్తం 176.81 కోట్లు (అదనంగా 36.2 కోట్లు) చెల్లించాలని సిఫారసు చేసింది.

ఆంధ్ర ప్రదేశ్: 16.81 కోట్లు, అస్సాం: 19.90 కోటు, బీహార్: 3.42 కోట్లు, కాశ్మీర్, 12.02 కోటు, కేరళ: 20.82 కోటు మధ్యప్రదేశ్: 9.38 కోట్లు, మద్రాసు: 6.84 కోటు, మైసూరు: 21.82 కోట్లు, నాగభూమి: 10.88 కోట్లు, ఒరిస్సా 29.18 కోట్లు, రాజస్థాన్: 9.67 కోట్లు, ఉత్తర ప్రదేశ్: 9.85 కోట్లు, పశ్చిమ బెంగాల్: 7.24 కోటు ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల కింద పొందుతాయి.

లోగడ బీహార్, పశ్చిమ బెంగాల్‌కు గ్రాంటులు ఇవ్వడం లేదు. అయితే ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాలకు కూడా గ్రాంటులు ఇస్తాయి.

ఆంధ్రప్రదేశ్, అస్సాం, కాశ్మీర్, మధ్యప్రదేశ్, నాగభూమి, రాజస్థాన్‌లకు వచ్చే గ్రాంటులు పెరిగాయి. కేరళ, మైసూరు, ఒరిస్సా, యు. పి. లు పొందే గ్రాంటులలో మార్పులేదు.

ఇండియాలో ఇరాన్ రాయబారి శ్రీ మహమ్మద్ రెజా అమీర్-టేలర్ రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్‌కు తన నియామక పత్రాలను సమర్పించినప్పటి చిత్రం

## వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో పరిస్థితి మెరుగుదల

### గవర్నర్ల సమావేశం ప్రారంభిస్తూ రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్ వివరణ

### కొన్ని రాష్ట్రాలలో జరుగనున్న మధ్యంతరం ఎన్నికలు సుస్థిరప్రభుత్వాలకు దారితీయగలవని ఆశాభావం

న్యూఢిల్లీ, నవంబరు 15—

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఇటీవలి సంవత్సరాలలో వచ్చిన మాంద్యం నుంచి దేశం ఇప్పుడు కోలుకున్నదని రాష్ట్రపతి డాక్టర్ జాకిర్‌హుస్సేన్ నేడిక్కడ గవర్నర్ల సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ చెప్పారు

ఆహారోత్పత్తి ఎక్కువ చేయడం, ధాన్యపేరణ సమర్థవంతంగా నిర్వహించడం, ఎగుమతులను విస్తృతం చేయడం, దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం పరిస్థితిని బలపర్చుకోవడం ద్వారానే దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలమని కూడా రాష్ట్రపతి చెప్పారు.

ఇక్కడి రాజభవన్‌లో రెండు రోజుల పాటు జరిగే గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ల సమావేశానికి ప్రారంభోత్సవంచేస్తూఆయన ఈ విషయం చెప్పారు.

సాంఘిక, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన పథకాల అమలును త్వరితం చేయాలంటే స్థిరమైన ప్రభుత్వాలు ఉండవలసిన అవసరాన్ని గురించి ఆయన నొక్కి చెప్పారు.

పశ్చిమ బెంగాల్, బీహార్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో వచ్చే ఫిబ్రవరిలో జరిగే మధ్యంతరం ఎన్నికల అనంతరం స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడతాయనే ఆశాభావాన్ని రాష్ట్రపతి వ్యక్తపరిచారు.

కొంతమంది గవర్నర్లు ద్వంద్వపాత్ర నిర్వహించవలసిన వచ్చినవిషయం గురించి ప్రస్తావించి, ఈ సమావేశం ద్వారా అటువంటి గవర్నర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, అనుమానాలను తొలగించుకోవడానికి తోడ్పడుతుందనే ఆశాభావాన్నికూడా రాష్ట్రపతి వెలిబుచ్చారు.

ఇతరుల నుంచి హరిజనులను వేరుపరచిన ద్వేషం, అసహనాల తొలగింపుకు గట్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఇందుకు గాంధీ శత జయంతి సంవత్సరం మంచి అవకాశమని. ఈ విషయంలో గవర్నర్లుప్రత్యేకశ్రద్ధతీసుకోవాలని కూడా కోరారు.

అస్సాం పునర్వ్యవస్థీకరణ పథకం విషయం ప్రస్తావించి, కొండజాతుల ప్రజల రాజకీయ కోర్కెల సాధనకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పి, నిస్పృహను తొలగించి దేశ కీలక ప్రాంతంలో సుస్థిరత ఏర్పడడానికి తోడ్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తపరిచారు.

దేశంలోని ఆహార పరిస్థితిని గురించి చెబుతూ, ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల మూలంగా చాలా నష్టం జరిగిందని చెప్పి, వర్షాభావం వలన బాధపడుతున్న వారి పట్ల తమ సానుభూతిని తెలియజేశారు.

గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, బీహార్‌లలో వచ్చిన వరదల విషయం ప్రస్తావించి, ఆ ప్రాంతాలవారికి ఎంతో చేయవలసిందిఉందని. అది కూడా త్వరగా చేయాలని ఆయన చెప్పారు.

ఆహార పరిస్థితిని గురించి చెబుతూ, ప్రస్తుత సంవత్సరంలో వాతావరణ పరిస్థితులు దేశంలోని కొన్ని ప్రాంతాలలో బాగుండలేదని. అందువలన వివిధ చర్యలు తీసుకొనడం ద్వారా ఆహారోత్పత్తి అధికం చేయడానికి కృషి చేయాలని చెప్పారు.

దేశంలోని అనేక ప్రాంతాలలో ఇటీవల కురిసిన వర్షాలమూలంగా, ధరలు స్థిరంగా ఉంటాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తపరిచారు.

ఇటీవలి నెలలో పారిశ్రామిక ఉత్పత్తి మెరుగైందని కూడా రాష్ట్రపతి చెప్పారు.

## జూనియర్ కాలేజీలలో తెలుగులో విద్యాబోధన

### అనంతపురం సభలో విద్యామంత్రి వెల్లడి

అనంతపురం, నవంబరు 15—

రాష్ట్రంలో వచ్చే ఏడాదిలో ప్రారంభించనున్న జూనియర్ కాలేజీలలో బోధనాభాషగా తెలుగు వుండగలదని రాష్ట్ర విద్యామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు వెల్లడించారు.

జూనియర్ కాలేజీలు దశలవారీగా ప్రారంభించబడగలవని ఆయన చెప్పారు.

జూనియర్ కాలేజీలకు నెలకొల్పే సమస్య విషయమై పరిశీలనకు రాష్ట్రంలోని యూనివర్శిటీల వైస్ చాన్సలర్లతోను, విద్యాశాఖ డైరెక్టర్‌తోను ఒక బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలియజేశారు.

అనంతపురం మునిసిపల్ కౌన్సిల్ నిన్న తనకు సన్మానం చేసిన సందర్భంగా, మంత్రి సమాధానమిస్తూ ఈ విషయాన్ని తెలియజేశారు.

షెడ్యూల్డు జాతులు, షెడ్యూల్డు తరగతుల విద్యార్థులకు రైలు ఛార్జీల మినహాయింపు విషయంలో అదనపు సౌకర్యాలను కల్పించడానికి రైల్వే బోర్డు నిశ్చయించింది.

## తుపానుబాధితులకు సత్వర సహాయం

### సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాలకు రాష్ట్రమంత్రివర్గంచేరు. 50 లక్షలు మంజూరు

### కృష్ణాజిల్లాలో జరిగిన నష్టం విషయమై కలెక్టర్ నివేదిక త్వరలో అందగలదని అధికార ప్రతినిధి వెల్లడి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 15—

శ్రీకాకుళం జిల్లాలో తుపానువల్ల దెబ్బతిన్న ఇచ్ఛాపురం, సోంపేట తాలూకాలలో తక్షణ సహాయం సమకూర్చడానికి రు. 50 లక్షలను రాష్ట్ర మంత్రివర్గం నేడిక్కడ సమావేశమై మంజూరుచేసింది

తుపానువల్ల వంటలకు, పశువులకు, ఇండ్లకు జరిగిన తీవ్రనష్టాన్ని గురించి మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది.

ఆ ప్రాంతాలలో వర్షంటించి వచ్చిన వ్యవసాయ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి, తుపానువల్ల నష్టం అనేకకోట్ల మేరకు వుండవచ్చునని చెప్పినట్టు తెలుస్తున్నది.

తుపానువల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించిన రెవిన్యూమంత్రి పట్టాదారు కూడా జరిగిన నష్టం గురించి తన నివేదికను మంత్రి వర్గానికి సమర్పించారు.

ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బును ఇండ్ల నిర్మాణానికి తుపానువల్ల దెబ్బతిన్న నీటి వనరుల బాగుచేతకు వినియోగించడం జరగగలదని. ప్రభుత్వ అధికార ప్రతినిధి మంత్రివర్గం సమావేశం ముగిసిన పిదప పత్రికలవారికి తెలియజేశారు. బెస్తవారికి వలల కొనుగోలుకు తోటలు దెబ్బతిన్న వ్యవసాయ దారులకు కూడా సహాయాన్ని సమకూర్చడం జరుగుతుంది.

### కృష్ణాజిల్లాలో నష్టం వివరాలు

కృష్ణాజిల్లాలో తుపానువల్ల జరిగిన నష్టంపై తన నివేదికను కృష్ణాజిల్లా కలెక్టర్, పొలాలనుంచి వరదనీరు తగ్గుముఖం పట్టిన తరువాత మాత్రమే పంపగలరని అధికార ప్రతినిధి చెప్పారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం కలెక్టర్ నుంచి సమాచారం అందినదని ఆయన తెలియచేశారు.

శీతాకాల సమావేశంలో శాసనసభలో గవర్నర్ చేయవలసిన ప్రసంగంనుంచి కూడా మంత్రివర్గం చర్చించింది.

### లోకంతీరు

"ఏమిటండీ, ఈ అల్లరీ ఆగడం! ఇది ఇల్లనుకున్నారా. పార్లమెంటు అనుకున్నారా?"

## చంద్రమండలాన్ని చుట్టివచ్చిన తాబేళ్ళు

మాస్కో, నవంబర్ 15 — చంద్రమండలాన్ని పరిభ్రమించి భూమి మీదకు సురక్షితంగా తిరిగివచ్చిన ఒక రోదసీ నౌకలో తాము మొట్టమొదటగా తాబేళ్ళను పంపినట్టు నేడు సోవియెట్ శాస్త్రజ్ఞులు వెల్లడించారు.

మానవుని చంద్రమండల యాత్రను సుగమం చేయడానికి ఈ ప్రయోగం తోడ్పడగలదని వారు తెలియజేశారు.

జాండ్-5 రోదసీ నౌకలో తాబేళ్ళను పంపినట్టు కమ్యూనిస్టు పార్టీ పత్రిక "ప్రావ్దా"లో వ్రాసిన ఒక వ్యాసంలో రష్యన్ శాస్త్రవేత్తలు ప్రకటించారు.

రోదసీ నౌక చంద్రమండల ప్రదక్షిణంచేసి హిందూ మహాసముద్రంలో సురక్షితంగా దిగిన విషయం పాఠకులకు విదితమే.

## దక్షిణ వియత్నాం ప్రధాని రాజీనామా?

సైగాన్, నవంబర్ 15— దక్షిణ వియత్నాం ప్రధాని ట్రాన్‌వాన్‌హువాంగ్ తన రాజీనామాను ప్రెసిడెంట్ గుయెన్‌వాన్ థియూకు సమర్పించినట్టు అనధికారవర్గాల వారు నేడు వెల్లడించారు.

దక్షిణ వియత్నాం మంత్రివర్గంలో పూర్తిమార్పులు చేయడానికి కూడా అయిన ఈ రాజీనామా సమర్పించినట్టు తెలుస్తున్నది.

### అధికార ప్రతినిధి ఖండన

ప్రధాని ట్రాన్‌వన్ హువాంగ్ తన పదవికి రాజీనామా సమర్పించేట్టు వచ్చిన వార్తలను ప్రభుత్వ ప్రతినిధి ఖండించారు.



1968 నవంబర్ 16 శనివారం
శ్రీ కీలకనామ సంవత్సర
కార్తీక బహుళ ఏకాదశి
ఏకాదశి: రా॥ 1.16 ఉత్తర: రా॥ 7.54
వర్జ్యం: రా॥ 3.52 నుంచి 5.23 వరకు

• • •

1968 నవంబర్ 17 ఆదివారం
శ్రీ కీలకనామ సంవత్సర
కార్తీక బహుళ ద్వాదశి
ద్వాదశి: రా॥ 11.10 హస్త: సా॥ 6.39
వర్జ్యం: రా॥ 2.01 నుంచి 3.29 వరకు

# ఆంధ్రజ్యోతి

"తమసో మా జ్యోతిర్గమయ"

## మావో, షేక్స్పియర్

షేక్స్పియర్‌ను సమస్త నాగరిక ప్రపంచం గౌరవిస్తుంది. ప్రపంచ నాటకకర్తలలో అగ్రగణ్యుడని నెత్తిన పెట్టుకుంటుంది. పాశ్చాత్య, ప్రాచ్య దేశాలవారే కాదు, కమ్యూనిస్టు దేశాలవారుకూడా అతని నాటకాలను శిరోధార్యాలుగా పరిగణిస్తారు.

కమ్యూనిస్టుల కుల గురువైన మార్క్స్ దృష్టిలో షేక్స్పియర్ చేతిలో నాటక రచనా శిల్పం పరాకాష్ఠ అందుకున్నది. జర్మన్ నాటకకర్త షిల్లర్‌కంటె షేక్స్పియర్‌ను ఎక్కువగా అతడు పరిగణించేవాడు. రోజుకొక సారైనా షేక్స్పియర్ నాటక భాగాలను అతడు పఠించేవాడు. వాటిలో అనేకం అతనికి కంఠతా వచ్చు. అతని కుటుంబంలో కూడా "షేక్స్పియర్ కల్ట్" వుండేదట. మార్క్స్, అతని కుమార్తెలు ఒక "గేమ్" ఆడేవారట. ఒకరొక "ప్యాసేజ్"ను ఉదాహరిస్తే అది షేక్స్పియర్ రచించిన ఏ నాటకం లోనిదో మిగిలినవాడు చెప్పుకోవాలి. అదీ ఆ "క్రీడ".

మార్క్స్ అనుయాయులైన రష్యన్లు కూడా షేక్స్పియర్‌ను గౌరవిస్తారు. అతని నాటకాలను ఒక రిద్దరు కాదు, అయిదారుగురు రష్యన్ భాషలోనికి తర్జుమా చేశారు అట్టి అనువాదకులలో కీర్తిశేషుడు బోరిస్ పాస్టర్నాక్ కూడా ఒకడు. షేక్స్పియర్ నాటకాలను మాస్కోలోని ప్రసిద్ధ నాటక మందిరాలలో తరుచుగా ప్రదర్శించడమే కాదు, వాటిని గొప్ప కళాత్మక చలనచిత్రాలుగా కూడా నిర్మించారు.

యూరోపియన్ పునరుజ్జీవనం(రినేశాన్స్) షేక్స్పియర్‌లో పరాకాష్ఠ స్థాయికి చేరినదని, అతడు భూస్వామిక విధానాన్ని వ్యతిరేకించి రాజరిక వ్యవస్థను అభిమానించినవాడని రష్యన్లు అభిప్రాయపడతారు. అందువల్ల అతనికాలం నాటికి షేక్స్పియర్‌ను విప్లవవాదిగానే వారు భావిస్తారు. ఇంతేకాక, మానవ ప్రవృత్తి వైవిధ్యాన్ని అతనివలె కాచి వడబోసిన నాటక రచయిత మరొకరు లేరని, అతడు గొప్ప మానవతావాది అని వారు విశ్వసిస్తారు.

రష్యన్లకు, మిగిలిన వారికి షేక్స్పియర్ రచనల అవగాహనలో, దృక్పథంలో కొన్ని విభేదా లుండవచ్చుగాని, మొత్తంపై అతడిని అసమానుడైన నాటకకర్తగా భావించడంలో తేడాలేదు. కాని, ఈరందరిది ఒకదారి, ఉలిపికట్టెది ఒకదారి అన్నట్టు మావో చైనాకు మాత్రం షేక్స్పియర్ పనికిరాలేదు. అతని "హామ్లెట్", "ఒథెల్లో" నాటకాలనుంచి నిర్మించిన చలన చిత్రాలను చైనీస్ సినిమా మందిరాలలో నిషేధించారట. అవి రాజరికాన్ని, బూర్జువా మానవతావాదాన్ని సమర్థించే నాటకాలట. "హామ్లెట్"లో వ్యక్తిగత ద్వేషం ప్రధానంకాగా, "ఒథెల్లో" లో ప్రేమ ముఖ్యమట. ఇందుచేత వాటిని నిషేధిస్తున్నట్టుగా పీకింగ్ సినిమా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రెడ్ గార్డులు ప్రకటించారట.

వారు నిషేధించిన షేక్స్పియర్ చలన చిత్రాలు రష్యన్ నిర్మాణాలు షేక్స్పియర్ నాటకాలను పాశ్చాత్యులు కూడా చలనచిత్రాలుగా నిర్మించినప్పటికి, ముఖ్యంగా కొన్ని రష్యన్ నిర్మిత చిత్రాలు అమెరికన్, తదితర నిర్మాణాలకంటె విశిష్టమైనవిగా వున్నాయని బ్రిటిష్ విమర్శకులే అంగీకరించారు. కాగా, వాటిని మావో చైనా నిషేధించడం విడ్డూరం

చైనీస్ రెడ్‌గార్డులు "విషతుల్యం"గా భావించి, నిషేధించిన మరొక చలనచిత్రం అరెగ్జాండర్ డ్యుమా నవల "త్రీ మస్కెటీర్స్" ఆధారంగా తీసినదట. ఫ్రెంచి నవలా కర్తలలో డ్యుమా ప్రథమశ్రేణికి చెందినవాడు కాకపోవచ్చుకాని, అతని విశిష్టత అతనిది. "త్రీ మస్కెటీర్స్" నవలలో ద ఆర్టగ్నాన్, పార్తోస్, ఎరామిస్, ఎథోస్ పాత్రలు, వారి సాహసాలు ప్రపంచ సాహిత్యంలో అజరామరంగా నిలిచిపోతాయి. డ్యుమా సయితం ప్రధానంగా మానవతావాది. బహుశా ఈ కారణంవల్లనే మావోకు అతని రచనలు గాని, వాటి చలనచిత్రాలుగాని సహించి వుండకపోవచ్చు.

మానవ సంస్కృతి, సభ్యత, నాగరికత క్రమానుగత పరిణామం చెందుతూ వస్తున్నాయి. వాటిలో అనేక విశిష్ట లక్షణాలున్నట్టే, కొన్ని అభివృద్ధి నిరోధక లక్షణాలు కూడా వుండవచ్చు. వాటిలో ఏ పురోగతి సాధించాలన్నా పాత పునాదులపైనే సాధించాలి గాని, పునాదులనే పెకలించరాదు. అది "నిహిలిజం" కాగలదేమోతప్ప కమ్యూనిజం కానేరదు. కమ్యూనిజం ఒకప్పుడు మానవతావాదాన్ని పుణికి పుచ్చుకున్న సిద్ధాంతమన్న అభిప్రాయం జనంలో వుండేది ఆ అభిప్రాయాన్ని స్టాలిన్ చాలవరకు చెదరగొట్టాడు ఇప్పుడు మావో పూర్తిగా పటాపంచలు చేస్తున్నాడు. కాని, ఒక్క సంగతి: సూర్యునిపై దుమ్ము చల్లితే అది తిరిగి మనకంటిలోనే పడుతుంది. షేక్స్పియర్‌పై ఎంత దుమ్మెత్తిపోసినా, అది తిరిగి పడేది మావో కళ్ళలోనే.

## టిక్కెట్టులేని ప్రయాణాలు

కంచెయే చేను మేసినదన్న సామెతలో వలె మొన్న విజయవాడ రైల్వే స్టేషనులో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తూ పట్టుబడిన వారిలో ఒక పోలీసు కాన్‌స్టేబిల్ కూడా వున్నాడట. పైగా అతడు సి. ఐ. డి. బ్రాంచికి చెందిన వాడట.

టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేయడం నేరం. దీన్ని నిరోధించడంలో తోడ్పడవలసిన వారే ఆ నేరాన్ని చేస్తుంటే ఇక చెప్పేదేముంది?

ఈ నేరాన్ని చేస్తున్నవారిలో పేదలు, కలవారు, సామాన్య పౌరులు, అధికారులు అని భేదం లేదు, చాలా వర్గాలకు చెందినవారు కనబడతారు. అదొక తప్పుగా చాలమందికి తోచడంలేదేమో. ఇందువల్ల ప్రభుత్వానికి ఏటా ఏ పాతిక కోట్ల రూపాయల మేరకో నష్టం సంభవిస్తున్నదట రైల్వేశాఖ ఎన్ని కట్టుదిట్టాలు చేసినా, ఎంత చెక్కింగ్ సిబ్బందిని నియమించినా, టిక్కెట్టులేని ప్రయాణాలను పూర్తిగా అరికట్టడం సాధ్యంకాకపోవచ్చు అంత పకడ్బందీగా చేయాలంటే వ్యయం కూడా అమితంగానే వుంటుంది. కాని, ఇంత భారీ ఎత్తున నష్టం సంభవిస్తుండగా చూస్తూ వూరుకోవడం కూడా భావ్యంగా లేదు. దీనికి సరియైన చర్యలు తీసుకోవలసిందే.

ఇటీవల ఇట్టి నేరాలను అరికట్టడానికి రైల్వే అధికారులు ఒక కొత్త పద్ధతిని అవలంబించారు. విద్యార్థుల సహాయాన్ని వారు తీసుకుంటున్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా తమ సహాయాన్ని అందజేస్తున్నారు. దేశంలో చాలా రైల్వే మండలాలలో విద్యార్థులు ఈ విధంగా రైళ్ళలో టిక్కెట్టు లేని ప్రయాణికులను పట్టుకుని అధికారులకు అప్పగించడం, జుల్మానాలు వగైరాలను వసూలు చేయడం చేశారు. సాధారణంగా క్రమశిక్షణ పాటించడం లేదన్న విందకు లోనౌతున్న విద్యార్థులు ఇటువంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఎంతైనా మెచ్చదగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మన కాలేజీల విద్యార్థులు ఈ విషయంలో ముందంజ వేయడం సంతోషకరం.

రైల్వేలకు సంభవిస్తున్న నష్టం టిక్కెట్లు లేని ప్రయాణాలవల్లనే కాదు. ఇంకా ఎన్నో విధాలుగా రైల్వే ఆస్తులు దొంగిలింపబడుతున్నాయి. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం ఒక సమగ్ర శాసనాన్ని తీసుకురాబోతున్నది. ఇది సముచిత చర్యే. అదే విధంగా టిక్కెట్లులేని ప్రయాణాలను అరికట్టడానికి కూడా తగు కట్టుదిట్టాలను చేయడం ఎంతైనా అవసరం.

వైస్-ఛాన్సలర్ జనసంఘం సానుభూతిపరుడు కావడమే

# బెనారస్ యూనివర్శిటీ కల్లోలాలకు కారణమా?

ఇటీవల పంజాబ్, ఉత్తరప్రదేశ్ యూనివర్శిటీలలో ఏర్పడిన అశాంతిని కేవలం విద్యార్థుల అశాంతి కింద జమకట్టడానికి వీలులేదు. రాజకీయ కారణాలు, శత్రుత్వాలు బెనారస్, అలహాబాద్, లక్నో, గోరఖ్‌పూర్ యూనివర్శిటీలలోని తగాయిదాలకు కారణాలు.

అలహాబాద్, గోరఖ్‌పూర్, లక్నో యూనివర్శిటీలలోని అల్లర్లకు, బెనారస్ యూనివర్శిటీలో జరిగిన అల్లర్లకు చాలా తేడా వుంది. బెనారస్ యూనివర్శిటీ జాతీయ సంస్థ, మన జాతీయ జీవితంలోని వైవిధ్యాలు, లోపాలు దానిలో కూడా ప్రతిఫలిస్తూ వుంటాయి. అయినా, అది తూర్పు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంస్థ, ఈ సంస్థలోని విద్యార్థులు, అధ్యాపకులు కూడా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారైనప్పటికీ వారిలో అధిక సంఖ్యాకులు దారిద్ర్యంతో బాధపడుతున్న తూర్పు యు. పి. కి చెందినవారు. అందువల్ల, ఈ యూనివర్శిటీ రెండు పరస్పర విరుద్ధమైన రాజకీయ భావాలకు ఆకరం కావడంలో ఆశ్చర్యం లేదు. యూనివర్శిటీలో ఒక ప్రక్క కమ్యూనిస్టువర్గం, మరొకవంక ఆర్. ఎస్. ఎస్. వర్గం ప్రాబల్యంలో వున్నాయి.

వీటికితోడు ఇటీవల ఒక పరిణామం జరిగింది. స్వాతంత్ర్యానికి పూర్వం, 1947 కి తరువాత కొంతకాలం వరకు బెనారస్ యూనివర్శిటీలోకి విద్యార్థులు అఖిలభారత ప్రాతిపదికపై వచ్చేవారు. అయితే, ఇది తూర్పు యు. పి. లోని విద్యావంతులలో అసంతృప్తికి కారణమైనది. అంతేకాక, యు. పి. లో ఇటీవల విద్యాసంస్థలు హెచ్చుకావడం వల్ల బెనారస్ యూనివర్శిటీలో ఉన్నత విద్యాభ్యాసం చేయగోరే ప్రాంతీయ విద్యార్థుల సంఖ్య కూడా హెచ్చుకి హెచ్చుఅయింది.

కాగా, ఈ సమయంలోనే బెనారస్ యూనివర్శిటీ వ్యవసాయవాదాలు మారాయి. తూర్పు యు.పి. లో మొదటే చెప్పినట్టు దారిద్ర్యంఅధికం. వీరిలో కొందరు ఆర్. ఎస్. ఎస్. కిందికిపోగా, కొందరు కమ్యూనిజంకిందకు వెళ్ళారు. అందువల్ల యూనివర్శిటీ వ్యవహారాలలో కూడా ఈ రెండు వర్గాల ప్రభావం కొనసాగింది. ఈ రెండు వర్గాల సంఘర్షణలను రాజకీయాలలో ఆసక్తిగల ఉపాధ్యాయులు, రాజకీయవేత్తలు ప్రోత్సహిస్తూ వచ్చారు.

ఇది దాదనట్టు, మూడు సంవత్సరాల క్రితం మరొక విశేషం జరిగింది. డాక్టర్ త్రిగుణసేన్ వైస్-ఛాన్సలర్ కావడం. ఆయన "అలీన" విధానాన్ని అవలంబించడం ద్వారా యూనివర్శిటీలో కాంతిని నెలకొల్పారు. తత్ఫలితంగానే ఆయన ఢిల్లీకి విద్యామంత్రిగా వెళ్ళారు.

శ్రీ సేన్ తరువాత శ్రీ ఎ. పి. జోషి వైస్-ఛాన్సలర్ అయ్యారు. డాక్టర్ జోషి జనసంఘం అభిమాని అన్నది బహిరంగ రహస్యమే. జనసంఘం ఆర్. ఎస్. ఎస్. లతో ఆయన సన్నిహితత్వానికి సందర్భించిన అనేక కథలు. గాథలు వున్నాయి. ఆర్. ఎస్. ఎస్. అధినేత శ్రీ ఎం. ఎస్. గోల్వాల్కర్

### కాత్యాయన్

శ్రీ జోషి ఒకే గదిలో పడుకునేవారట. ఈ విషయాన్ని శ్రీ జోషి కాదంటున్నారనుకోండి. పోతే, ఆర్. ఎస్. ఎస్. సమావేశాలను ఆయన యూనివర్శిటీ ఆవరణలో జరపనిస్తున్నాడన్నది రెండవ ఆరోపణ. ఇందుకు శ్రీ జోషి జవాబు— పండిట్ మదన్ మోహన్ మాలవీయా నాటినుంచి ఈ సమావేశాలు యూనివర్శిటీ ఆవరణలో జరుగుతున్నాయని, ఏ వైస్-ఛాన్సలర్‌కు వీటిని నిషేధించాలన్న వుద్దేశం కలగలేదని! కాగా, శ్రీ జోషి వైస్-ఛాన్సలర్‌గా వచ్చినప్పటి నుంచి ఆయనను తొలగించాలని కమ్యూనిస్టులు, ఎస్. ఎస్. పి. మొదలైన వర్గాలవారు కృషి చేస్తూవుంటే, ఆయనను అధికారంలో నిలపాలని జనసంఘం, ఆర్. ఎస్. ఎస్. వారు యత్నిస్తున్నారు. ఈ పరిస్థితులలో ఉభయ వర్గాలు ఒకరి సమావేశాలను మరొకరు భగ్నంచేసుకొనడం, దెబ్బలాడుకోవడం, చివరికి హత్యల వరకు వెళ్ళింది. ఒక జనసంఘేతర విద్యార్థియూనివర్శిటీ నుంచి ఏదో దొంగిలిస్తుండగా ఆర్. ఎస్. ఎస్. వలంటీర్లు చూచి, అతడిని విపరీతంగా కొట్టగా, అతడు మరణించాడని ఆరోపించబడుతున్నది. ఈ సంఘటనను మాఫీచేయడానికి వైస్-ఛాన్సలర్ యత్నించినట్టు విమర్శించబడుతున్నది. అయన స్కాలరు షిప్పులు, ఇతర సౌకర్యాలు పక్షపాతంతో ఇస్తున్నట్టు ఆరోపించబడుతున్నది. పోతే, విద్యార్థులు ఏ విషయాన్ని వ్రేచ్చగా మాట్లాడుకోడానికి వీలు లేదని, తమ వెనుక ఎవరైనావుంటే ఏమి మూడుతుందోనన్న అనుమానంతో వారు వుంటున్నారని మరొక ఆరోపణ. ఇక, స్వప్రయోజనపరులైన వారు వ్యాపింపజేసే వదంతులవల్ల ఈ ఉద్రిక్తత మరింత పెరుగుతున్నది. ఒక వ్యూహను ఆర్. ఎస్. ఎస్. వలంటీర్లు చంపివేశారని మరొక వదంతి. అతని శరీరాన్ని చూపించాలని విద్యార్థులు పట్టుబట్టారు. చివరికి తేలిందేమంటే, ఆ వ్యూహను నేలపుపై గ్రామాంతరం వెళ్ళాడని!

కిందటి వారం యూనివర్శిటీ ఆవరణలో తగాయిదాలు రావడానికి తక్షణ కారణం ఎన్నికలు. వామపక్షంవారు శ్రీ నరేంద్రప్రసాద్ విన్నాను. ఆర్. ఎస్. ఎస్. వారు శ్రీ దామోదర్‌సింగ్‌ను అధ్యక్షునిగా నిలబెట్టారు. శ్రీ దామోదర్‌సింగ్ ఆ పదవికి పోటీచేయడానికి అనర్హుడు. ఎందువల్ల నంటే, ఆయన సంవత్సరంగా విద్యార్థుల యూనియన్‌లో సభ్యుడు కాడు. అయినా వైస్-ఛాన్సలర్ అతడిని పోటీచేయడానికి ప్రత్యేకంగా అనుమతి నిచ్చారు. చివరికి వామపక్ష అభ్యర్థి గెలిచాడు. దానితో కొట్లాటలు బయలుదేరాయి. చివరికి పమ్మె చేయాలని కమ్యూనిస్టు అనుకూలవర్గాలు నిశ్చయించాయి. వైస్-ఛాన్సలర్ పోలీసులను పిలిచి యూనివర్శిటీని మూసివేయడానికి ఏర్పాటుచేశాడు. దీనితో కలోలం మరింత తీవ్రమైనది.

కాగా, బెనారస్‌యూనివర్శిటీ వ్యవహారాల వెనుక విద్యార్థుల అశాంతికంటె రాజకీయాల పాత్ర హెచ్చుగా వున్నదని అర్థంకావడంలేదా?

# కె.వి.రమణయ్యనాయుడు బహుముఖ సేవలు

(నేడు మచిలీపట్టణంలో కీర్తిశేషులు శ్రీ కొల్లిపర వెంకట రమణయ్య నాయుడుగారి కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతున్న సందర్భంగా ఆయన జీవిత విశేషాలను వివరించే ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము-ఎడిటర్.)

"అన్ని రంగాలలోను బందరు పట్టణం అభివృద్ధి చెందకుండా వెనుకబడి వుంది. డాక్టరు పట్టాభి లేకపోయినా మన కొల్లిపర వెంకటరమణయ్య నాయుడుగారు బతికి వుంటే బందరు అభివృద్ధికి పాటుపడేవారే" అని ప్రతి బందరు పౌరుడు అనుకోవడంలో తప్పేమిలేదు.

ఆయనది పిండైన విగ్రహం. పిందు కుండ వంటిమనసు. పిందుతనంతప్ప పెరిగి ఎదిగని హృదయం. పైకి గంభీరంగా కనిపించినా, మాటలో కరుకుదనంవున్నా చూపులో కారుణ్యం తొణికిసలాడేది. తాను కష్టపడినదనువుకొని ప్రయోజకుడైనట్టే అందరు చదువుకొని పైకిరావాలని ఎంతోమంది పేద విద్యార్థులకు ఆయన చదువు చెప్పించి ప్రయోజకులను చేశారు.

ఆయన ఆశయాలకు విరుద్ధంగా ఎవరైనా మాట్లాడితే బరబర దులిపివేసేవాడు. ఆగ్రహమైనా, అనురాగమైనా ఆయన విషయంలో ఒక కొండవాగు, ఒక అగ్నిపర్వతం. ఎదుట ఒకమాట, చాటున మరొక మాట ఆయనకు చేతకాదువిద్య.

1888 అగస్టు 18 న బందరు తాలూకా గూడూరు గ్రామంలో జన్మించి ప్రాథమిక విద్య అక్కడ ముగించి బందరు హిందూ హైస్కూలులోను, నోబుల్ కళాశాలలోను చదివి పట్టభద్రులై మద్రాసులో న్యాయశాస్త్ర పట్టభద్రుడై 1914 లో న్యాయవాది వృత్తిలో ప్రవేశించారు. శ్రీ జె. డి. కామ్యూల్‌వద్ద జూనియర్‌గా వ్యవహరించి స్వతంత్రంగా ప్రాక్టీసుపెట్టారు. 45 సంవత్సరాలు న్యాయవాదిగా అనేకమంది పేదల సమస్యలను గురించి న్యాయస్థానంలో వాదించి వారికి న్యాయం చేకూర్చిపెట్టారు. ప్రభుత్వం శ్రీ నాయుడుగారి దక్షతను గుర్తించి ప్రభుత్వ ప్లీడరుగాను, పబ్లిక్ ప్రాసిక్యూటరుగాను నియమించింది.

### రాజకీయాలలో ప్రవేశం

కళాశాల విద్యార్థిగా వున్నప్పుడే శ్రీ రమణయ్య నాయుడు రాజకీయాలలో ప్రవేశించారు. న్యాయవాద వృత్తివల్ల పలుకుబడి పెంచుకొని జిల్లా రాజకీయాలలో పెరిగి పెద్దవారయ్యారు. రాష్ట్ర నాయకులతో అపారమైన పరిచయం ఏర్పడింది. రాజకీయాలలో ఎత్తుకు పైఎత్తువేసి నెగ్గుకురాగలిగారు. ఎన్నికల వాతావరణాన్ని అనుకూలంగా తిప్పేవారు. రాజకీయ ప్రవాహంలో ఎదురు ఈదడంలోనే ఆయన అంతమైపోయారు.

జిల్లా, తాలూకా స్థాయిలో ఆయన అనుభవించని పోదా లేదు. న్యాయవాదుల సంఘానికి అధ్యక్షులుగా, తాలూకా బోర్డు అధ్యక్షులుగా, జిల్లా బోర్డు సభ్యునిగా, మునిసిపల్ చైర్మన్‌గా, యూనివర్శిటీ సిండికేటు సభ్యునిగా, కృష్ణా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకి అధ్యక్షులుగా శ్రీ నాయుడు ప్రజాసేవ చేశారు.

విద్యా సంఘాలలో సభ్యులై కళాశాలలు లేని ప్రాంతాలలో కాలేజీలు స్థాపించారు.

బందరు జాతీయ కళాశాల పునర్నిర్మాణ కృషిలో పాల్గొని పాలక సభ్యుడైనారు.

శ్రీ కింగిన్నాతరావునాయుడుగారిసీటులో రాజకీయ రంగంలో సవ్యసాచి అనిపించుకున్న శ్రీ కొల్లిపర రమణయ్యనాయుడు ఉత్తమ నాయకుడుగా, ప్రజాసేవకుడుగా అనేక సంస్థలు, సంఘాలు నెలకొల్పి అనవాళ్ళు దిద్దారు.

రాష్ట్రంలోనే పెద్ద పార్కుగా పేరు పొందిన మాకర్ల మునిసిపల్ పార్కు నిర్మాణంలో వీరి కృషి మరువరానిది. బందరు వియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభ్యునిగా ఎన్నికై ప్రభుత్వం రూపొందించిన అనేక కమిటీలలో సభ్యునిగా వ్యవహరించి రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిపారు.

### శ్రీ విడియాల చంద్రశేఖరరావు

సహకార రంగంలో అపూర్వమైన అనుభవం సంపాదించారు. కృష్ణా కోపరేటివు సెంట్రల్ బ్యాంకి అధ్యక్షులుగావుంటూ జిల్లాలోని పౌనైటీలకు అప్పులు ఇస్తూ రైతులకు వాటిద్వారా ఋణాలు అందిస్తుండేవారు. మద్రాసు ప్రొవిన్షియల్ కోపరేటివు బ్యాంకి డైరెక్టరుగా, ఆంధ్ర స్టేట్ కోపరేటివు బ్యాంకి డైరెక్టరుగా, మద్రాసు కోపరేటివు వైఫ్ అండ్ జనరల్ ఇన్సూరెన్సు సొసైటి డైరెక్టరుగా, ఆంధ్ర బ్యాంకి డైరెక్టరుగా, హిందూ కళాశాల, జాతీయ కళాశాల పాలకవర్గ సభ్యునిగా అనేక పదవుల నిర్వహించారు.

డాక్టరు పట్టాభి సీతారామయ్యకు అంతరంగిక మిత్రులుగా గుర్తింపబడ్డారు. జస్టిస్ పార్టీలో నుంచి శ్రీ నాయుడు కాంగ్రెసులో చేరారు. రాష్ట్ర కాంగ్రెసు పంపు సభ్యునిగా కాంగ్రెసు ఉద్యమాలు నిర్వహించారు.

ఆయన కాంగ్రెసులో వున్నా ప్రభుత్వ విధానాలలో లోపాలను నిశితంగా విమర్శించేవారు. రాష్ట్ర నాయకులపై తం శ్రీ నాయుడుగారి విమర్శలకు భయపడేవారు. శ్రీ నాయుడుగారికి వంతపాడడం చేతకాదు, చేతులుకట్టుకొని నిలబడేవారు కాదు. ఎప్పుడూ పెద్దపీటమీదనే కూర్చునేవారు.

బందరు రేవు అభివృద్ధి కోసం ఆయన కృషిచేశారు. ఆ ఆశయం అమలు జరుపుకోలేకపోయారు. లా కాలేజీని బందరులో స్థాపింపజేశారు. కాని అది చివర వరకు నిలవలేదు. రాష్ట్ర శాసన సభ్యుడుగా ఎన్టిమేట్ల కమిటీ అధ్యక్ష పదవి, భూసంస్కరణల సంఘ సభ్యత్వం నిర్వహించారు. 1959 జనవరిలో ఆయన కన్ను మూశారు.

ఆయన పేరుతో మార్కెట్టు, పార్కు, మునిసిపల్ ఆఫీసు భవనం, కృష్ణా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకి భవనం నిర్మించారు. ఆయన అభిమానులు కాంస్య విగ్రహం తయారు చేయించి నవంబరు 16వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారిచే ఆవిష్కరింప జేయడం ముదావహం, ఆ సభకు శ్రీ తోట రామస్వామి అధ్యక్షత వహిస్తున్నారు.

## బ్రిటిష్ విదేశాంగమంత్రి మద్రాసు సందర్శన

మద్రాసు, నవంబర్ 15—బ్రిటిష్ విదేశాంగ మంత్రి శ్రీ మైఖేల్ స్టీవర్ట్ డిసెంబర్ రెండవ తేదీన ఇండియాకు వచ్చినప్పుడు మద్రాసు, బొంబాయి నగరాలను కూడా సందర్శిస్తారు.

శ్రీ స్టీవర్ట్ డిసెంబర్ ఆరవ తేదీన మద్రాసు, డిసెంబర్ ఎనిమిదవ తేదీన బొంబాయి వెడతారు.

ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యాసంస్థలలో ప్రదర్శించడానికి రాష్ట్ర నాయకుల చిత్ర పటాలను బహుమతులుగా స్వీకరించరాదని మద్రాసు ప్రభుత్వం అన్ని పాఠశాలలను, స్థానిక సంస్థలను ఆదేశించింది.

## లోకసభలో ప్రతిపక్షపార్టీల అల్లరి

### పి. ఎస్. పి, అధ్యక్షులు శ్రీ ఎస్. జి. గోరె విమర్శ

పూనా, నవంబరు 15—అవిశ్వాస తీర్మానంపై లోకసభలో జరుగుతున్న చర్చ సందర్భంలో ప్రధాని ప్రసంగిస్తున్నప్పుడు కొంత మంది పార్టుమెంటు సభ్యులు, ముఖ్యంగా ఎస్. ఎస్. పి. సభ్యులు అనుసరించిన విధానంవల్ల ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎస్. జి. గోరె విన్న తన తీవ్ర ఆందోళనను వ్యక్తపరచారు.

ఆయన ఇక్కడ చేసిన ఒక ప్రకటనలో "ప్రభుత్వం దౌర్జన్య పద్ధతిలో వ్యవహరించిన విషయం స్పష్టమే కాని, ప్రతిపక్షానికి చెందిన మూడుపార్టీలు అనుసరించిన విధానం, దేశంలో ప్రజాస్వామ్యం అభివృద్ధికి తోడ్పడదు సరికదా, తాము ప్రాతిపదికం వహిస్తున్నామని చెప్పుకుంటున్న లక్షలాది కార్మికులకుకూడా న్యాయం చేకూర్చదు" అని ఆయన తెలియజేశారు.

## "దండి మార్గం" మరమ్మత్తు

### 30 వేల మంది విద్యార్థులు శ్రమదానం చేస్తారని గుజరాత్ మంత్రి వెల్లడి

అహమ్మదాబాద్, నవంబరు 15—1930 వ సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా మహాత్మాగాంధి ఉపయోగించిన "దండిమార్గం"లో చెడిపోయిన రోడ్డు ప్రాంతాలను బాగుచేసే "శ్రమదాన్" కార్యక్రమంలో సుమారు 25 వేల నుంచి 30 వేల మంది వరకు బాల బాలికలు దాదాపు అంతేమంది గ్రామస్తులు పాల్గొంటారని గుజరాత్ రాష్ట్ర సాంస్కృతిక కార్యక్రమాల శాఖామంత్రి శ్రీ చిమన్‌భాయ్ పటేల్ మొన్న కిరాజిల్లా దహేవాన్ గ్రామంలో ఒక సాంస్కృతిక ఉత్సవం సందర్భంలో మాట్లాడుతూ చెప్పారు.

ఇందుకోసం 60 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అందులో 50 కేంద్రాలలో రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని ఆయనచెప్పారు.

## మణిపూర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి

### కొంత కాలం ఆగాలని కేంద్ర నాయకులు చెప్పినట్టు శ్రీ చంద్రా వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 15—మణిపూర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వడంలో ఇంకా కొంత కాలం ఆగవలసి వుంటుందని కేంద్ర నాయకులు, తాను నాయకత్వం వహించిన ఒక రాయబారవర్గం వారితో చెప్పినట్టు మణిపూర్ కేంద్ర పాలిత ప్రాంత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ వి. చంద్రా మొన్న వెల్లడించారు.

తాము ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధిని కలుసుకొనగా, తూర్పు ప్రాంతంలో వున్న అభివృద్ధి పరిస్థితుల దృష్ట్యా మణిపూర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వడం ఇప్పుడు సాధ్యం కాదని చెప్పినట్టు ఆయన అన్నారు.

ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించవలసి వుంటుందని ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్, హోం మంత్రి శ్రీ చావన్ చెప్పారట.

మణిపూర్‌కు 1972 నాటికి అయినా రాష్ట్ర ప్రతిపత్తి లభించగలదన్న ఆశాభావాన్ని శ్రీ చంద్రా వెల్లడించాడు.

### రాష్ట్ర ఎస్. ఎస్. పి. నాయకుని ప్రకటన

ఇంఫాల్, నవంబరు 15—మణిపూర్‌కు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం "అయిష్టంగా" ఉన్నందుకు విరసనగా తమ సభ్యత్వాలకు రాజీనామాలు ఇవ్వవలసిందని మణిపూర్ ఎస్. ఎస్. పి. అధ్యక్షులు, శాసనసభ్యుడు అయిన శ్రీ ఎల్. అచ్చాసింగ్ విన్న మణిపూర్ శాసనసభ సభ్యులను నిర్జ్ఞప్తిచేశారు.

తమ పార్టీ సభ్యులు శాసనసభను విడిచిపెట్టడానికి సిద్ధంగావున్నారని కూడా ఆయన చెప్పారు.

మణిపూర్ కాంగ్రెస్‌వాదుల ప్రతినిధి వర్గంతో సంభాషణలు జరిపిన తరువాత ప్రధానమంత్రి మణిపూర్ రాష్ట్ర కొర్కెవిషయంపై చేసిన ప్రకటన "విరుద్ధాభాసరంగా" వుందని ఆయన ఇక్కడ చేసిన పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

"మణిపూర్ ప్రజలలోవున్న అసంతృప్తి, విస్మృతులు ఏ సమయంలో నైనా తీవ్రపరిస్థితికి దారితీయవచ్చు. నాగ, మిజో విద్రోహులతో మణిపూర్ యువకులు చేతులు కలవవచ్చు. తద్వారా దేశపు తూర్పు ప్రాంతం భద్రతకు, సమగ్రతకు ప్రమాదం తీసుకురావచ్చు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది" అని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

నేటి నుంచి తమ పార్టీ ప్రారంభించతలపెట్టిన ఆందోళన, సహాయనిరాకరణోద్యమాలతోబాటు, కేంద్ర ప్రభుత్వంపై అత్యంత వత్తిడి తీసుకురావడానికి రాజ్యాంగ ప్రతిష్టంభన తీసుకురావడానికి కూడా ఎస్. ఎస్. పి. ప్రయత్నిస్తుందని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

## పూరి, గంజాం జిల్లాలకు తిరిగి తుపాను దెబ్బ

భువనేశ్వర్, నవంబర్ 15— ఒరిసా కోస్తా జిల్లాలు గంజాం, పూరి జిల్లాలలో మొన్న పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసినవి. గత మాసంలో సంభవించిన తుపాను, వరదల దీపర్యంనుంచి తేరుకొనకముందే మరల ఈ వర్షాలు వచ్చి పరిస్థితులను విషమింప చేసినట్టు ఇక్కడకు అందిన అధికార వార్తలు తెలుపుతున్నాయి.

భారీ వర్షాల మూలంగా చిల్కా సరస్సు నీటి మట్టం పెరుగుతున్నదట, సరస్సులో పొంగి పొరలిన జలాలు చుట్టుపట్ల గ్రామాలను ముంచి వేసినట్టు తెలుస్తున్నది. పెక్కు ఇళ్ళు నేలమట్టమయినట్టు అధికార వార్త

# హానోయ్‌తో ముఖాముఖి శాంతి సంప్రతింపులు

## సైగాన్ ప్రతినిధులు లేకుండా జరిపే యోచన లేదని అమెరికా స్పష్టీకరణ

వాషింగ్టన్, నవంబర్ 15—

సైగాన్ ప్రతినిధులు పాల్గొనకుండా అమెరికా, ఉత్తరవియత్నాం ప్రతినిధి వర్గాలు శాంతి సంప్రతింపులు జరిపే యోచన లేదని నిన్న అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది.

పారిస్ శాంతి సంప్రతింపులలో దక్షిణ వియత్నాం పాల్గొనే విధంగా అమెరికా అధికారులు కృషి కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితిలో అమెరికా విదేశాంగ శాఖ సైగాన్‌కు ఈ హామీనిచ్చింది.

విస్తృత ప్రాతిపదికపై పారిస్‌లో శాంతి సంప్రతింపులు ప్రారంభించాలనే పథకం విషయంలో ప్రస్తుతం ప్రతిష్టంభన ఏర్పడింది. జాతీయ విముక్తి సంఘటన ప్రతినిధులు పాల్గొనే సమావేశంలో తాము పాల్గొంటామని దక్షిణ వియత్నాం ప్రకటించింది.

"పారిస్ సంప్రతింపులలో సైగాన్ ప్రతినిధులు పాల్గొనరని మేము ఇప్పటికీ ఆశిస్తున్నాము" అని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి కార్ల్ బార్ట్‌చ్ పేర్కొన్నారు.

"మిత్ర రాజ్యాల" ఎజెండాకి సైగాన్ నాయకత్వం ఏకీభవించాలని, అమెరికా ప్రతినిధివర్గం ద్వితీయస్థానంలో వుండాలని, జాతీయ విముక్తి సంఘటన ప్రతినిధివర్గానికి ఇతర ప్రతినిధివర్గాలతో సమానమైన ప్రతిపత్తి ఇవ్వరాదని దక్షిణ వియత్నాం ప్రెసిడెంట్ గుయెన్‌వాన్ థియూ వాదిస్తున్నారు.

కడచిన 24 గంటలలో సైగాన్‌కు అమెరికా హామీ నివ్వడం ఇది రెండవ పర్యాయం.

దక్షిణ వియత్నాం పైభరివ్యక్షా పారిస్ శాంతి సంప్రతింపుల భవితవ్యానికి ఎట్టి ప్రమాదంలేదని అమెరికన్ వర్గాలవారు పారిస్‌లో వెల్లడించారు.

ప్రతిష్టంభన తొలగి పు అవకాశాలపట్ల వారు ఆశాభావం వ్యక్తపరిచారు.

### అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్‌కు సైగాన్ ఫిర్యాదు

ఉత్తర వియత్నాంపై విమానదాడులను విరమించిన వారం రోజులలో కమ్యూనిస్టులు కంమ్ని కాల్పులను కొనసాగిస్తున్నారని, విధ్వంస చర్యలను జరుపుతున్నారని, దౌర్జన్య చర్యలకు దిగుతున్నారని దక్షిణ వియత్నాం ప్రభుత్వం నిన్న అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

పట్టణాలపై 33 పర్యాయాలు శతఘ్నులతోను రాకెట్లతోను దాడిచేయడం జరిగిందని దక్షిణ వియత్నాం ప్రభుత్వం ఆరోపించింది. దౌర్జన్య చర్యలకు 326 మంది గురైనారని. వారిలో స్త్రీలు, పిల్లలు కూడా వున్నారని ఆరోపించడం జరిగింది.

అమెరికా గస్తీ విమానాలపై రెండు పర్యాయాలు విస్ఫోటక మందులు నుంచి కాల్పులు జరిగినట్లు కూడా ఆరోపించారు, అమెరికన్ యుద్ధనౌకలు విస్ఫోటక మందలంపై నిన్న కంమ్ని కాల్పులు జరిపాయి.

ఉత్తరవియత్నాం సైనికుల సంచలనం గురించి గస్తీ విమానం తెలియజేయడంతో ఈ కాల్పులు జరపవలసివచ్చింది.

### అమెరికన్ నష్టాలు

పారిస్ శాంతిసంప్రతింపులు ప్రారంభమయిన ఆరు నెలలలో వియత్నాం యుద్ధంలో మొత్తం 6319 మంది అమెరికన్ సైనికులు మరణించారని, 22,161 మంది క్షతగాత్రులయ్యారని నిన్న అధికారికంగా ప్రకటించారు.

1961 జనవరి నుంచి, మొత్తం 29350 మంది అమెరికన్ సైనికులు వియత్నాం యుద్ధంలో మరణించారు. క్షతగాత్రుల సంఖ్య 96,429 వరకు పెరిగింది.

### కంబోడియా సరిహద్దులో పోరాటం

కంబోడియా సరిహద్దులో దాడికి సన్నాహాలు చేస్తున్న ఉత్తర వియత్నాం దళాలపై అమెరికా, దక్షిణ వియత్నాం సైనికులు దాడి జరిపారు. ఈ సందర్భంలో జరిగిన పోరాటంలో కనీసం 287 మంది ఉత్తర వియత్నాం సైనికులు మరణించారని అందనా.

దాదాపు వెయ్యిమంది ఉత్తరవియత్నాం సైనికులు నాలుగు పర్యాయాలు ఎదురుదాడులు జరిపారని, ఆ దాడులను త్రిప్పికొట్టడం జరిగిందని అధికార ప్రతినిధి వెల్లడించారు.

### నిస్సైనిక మండలంలో యుద్ధ చర్యలు

నిస్సైనిక మండలంలో అమెరికన్ సైనికులున్నంత కాలం వియత్నాంగ్ గెరిల్లాలు దాడులను జరిపే హక్కు వున్నదని నిన్న ఉత్తర వియత్నాం వర్గాలు వ్యాఖ్యానించాయి.

నిస్సైనిక మండలంలో గెరిల్లా దాడుల పట్ల అమెరికా తీవ్రవైఖరి గైకొంటున్నదనే వార్తల దృష్ట్యా ఈ వర్గాలవారు పై విధంగా వ్యాఖ్యానించారు.

## మెక్‌నమారా 17 న ఢిల్లీ రాక

### ఇండియాలో ఏడు రోజుల అధికార పర్యటనకు

న్యూఢిల్లీ, నవంబర్ 15 — ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ రాబర్ట్ మెక్‌నమారా ఈ నెల 17 వ తేదీన ఇక్కడకు వస్తున్నారు. ఇండియాలో అధికార పర్యటనకు శ్రీ మెక్‌నమారా రావడం ఇదే ప్రథమం.

ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి, నాణ్యగత ప్రణాళికలో అభివృద్ధి లక్ష్యాలు మున్నగు విషయాలగురించి ఆయనతో పర్యటనలో తెలుసు కొంటారు.

ఏడు రోజులపాటు ఆయన ఇండియాలో పర్యటిస్తారు. మూడు రోజులు ఢిల్లీలోను, రెండు రోజులు కలకత్తాలోను, మద్రాసు, బొంబాయిలో ఒక్కొక్క రోజు శ్రీ మెక్‌నమారా పర్యటిస్తారు.

## కరాచీలో పెద్ద ఎత్తున వామపక్షాల నాయకుల అరెస్టులు

కరాచీ, నవంబర్ 15 — పాకిస్తాన్‌లో వామపక్ష నాయకులు అరెస్టులు దేశవ్యాప్తంగా నిన్నకూడా కొనసాగాయి.

కరాచీలో మొన్నరాత్రి నేషనల్ అవామీ పార్టీ జీయాఉద్దీన్‌ఖాన్‌లోదిని మరి 10 మంది రాజకీయ "కార్య"కర్తలను అరెస్టుచేయడం జరిగింది.

పెక్కుమంది విద్యార్థి నాయకులనుకూడా అరెస్టుచేశారు.

### పశ్చిమ పాకిస్తాన్ గవర్నర్ ప్రకటన

కరాచీ: నవంబర్15—

దేశంలో అరాజకాన్ని ప్రోత్సాహిస్తున్నందుకు ఢాలోను, మరి కొందరిని అరెస్టు చేసినట్లు ఎత్తిచూపి పాకిస్తాన్ గవర్నర్ మహమ్మద్ మూసామొన్న ఆరోపించారు.

ఆయన అకస్మికంగా రేడియోలో ప్రసంగిస్తూ "రింగ్ లీడర్స్"ను కస్టడీలో తీసుకొన్నట్లు తెలియచేశారు.

వారు ఇంకా అల్లర్లను సృష్టించడానికి యత్నించిన పక్షంలో ఇంకా చర్య గైకొనగలమని ఆయన అన్నారు.

వారి అరెస్టును సమర్థించేవారిపై చర్య గైకొనని పక్షంలో మరింత అరాజకం ఏర్పడి వుండేదని శ్రీ మూసా పేర్కొన్నారు.

కేరళ యూనివర్సిటీ బిల్లు ఓడిన విద్యాలయ సంఘం నిర్ణయాధికారాన్ని హరించబోదని విద్యాశాఖ శ్రీ శ్రీ మహ్మద్ కోయా స్పష్టంచేశారు.



విజయవాడలోని నెహ్రూ జన్మదినోత్సవంనాడు బ్లాక్ భారతసేవక్‌సమాజ్ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న సభాధ్యక్షులు, శాసన మండలికి అధ్యక్షులు శ్రీ పిడతల రంగారెడ్డి, శ్రీ ఎమ్. ఆర్. అప్పారావును కూడా చిత్రంలో చూడవచ్చు

# ఇంద్రప్రస్థ సంఘటనలపై న్యాయ విచారణ సూచన త్రోసివేత

## కొత్త దర్యాప్తు వలన ప్రయోజనం వుండదని హోమ్ మంత్రి శ్రీ చావన్ వివరణ

### మంత్రివర్గంలో విభేదాలు లేవని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 15—

ఇంద్రప్రస్థ సంఘటనలపై న్యాయ విచారణ జరపాలనే అభ్యర్థనను కేంద్ర హోమ్ మంత్రి శ్రీ వై. బి. చావన్ నేడు లోకసభలో త్రోసిపుచ్చారు.

న్యాయవిచారణ జరపడం ప్రయోజనకరం కాదని శ్రీ చావన్ అన్నారు. గంటపేపుకు పైగా ఇంద్రప్రస్థ సంఘటనలపై న్యాయవిచారణ జరపాలని పట్టుతీసుకొచ్చారు. అయినప్పటికీ ఫలితం సాధించ లేకపోయారు. కేంద్ర హోమ్ మంత్రిని ఒప్పించడంలో విఫలమయ్యారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల పమ్మె సందర్భంలో పఠాన్ కోటలో జరిగిన పోలీసు కాల్పులను గురించి కూడా న్యాయ విచారణ జరపవలసిన అవసరంలేదని దానివలన ఎట్టి ప్రయోజనం వుండదని శ్రీ చావన్ అన్నారు.

తమ అభ్యర్థనను కేంద్ర హోంమంత్రి విరాకరించడంతో ప్రతిపక్ష సభ్యులు స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తూ పార్లమెంటరీ దర్యాప్తు జరిపించాలని కోరారు. అయితే అట్టి అధికారాల విషయంలో స్పీకర్ సందేహం వెలిబుచ్చారు.

"ఈ విషయంలో మిమ్మల్ను ఒప్పించడానికి మేము మరింతగా కృషి చేయగలము" అని శ్రీ నాథ్‌పాయ్ స్పీకర్‌తో అన్నారు.

శ్రీ డి. సి. శర్మ ప్రశ్నకు కేంద్ర హోమ్ మంత్రి జవాబు చెబుతూ కేంద్ర ప్రభుత్వోద్యోగుల వ్యవహారాలపై మంత్రివర్గంలో విభేదాలున్నాయనే వుకార్లు నిరాధారమని, పూర్తిగా పొరపాటని అన్నారు.

సాధు సమాజం అల్లర్లను ఉపయోగించి శ్రీ జి. ఎల్. నందాను హోమ్‌మంత్రి పదవినుంచి తొలగించినట్లుగా ఇంద్రప్రస్థ సంఘటనలను ప్రతిపక్షం వినియోగించి శ్రీ చావన్ తొలగింప ప్రయత్నిస్తున్నారా? అని శ్రీ డి. సి. శర్మ అడిగారు.

శ్రీ చావన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వోద్యోగుల పమ్మెకు సంబంధించిన అన్ని సమస్యలను కేంద్ర మంత్రి వర్గం ఉప సంఘం సమగ్రంగా చర్చించిందని. నిర్ణయాలు సమష్టిగా చేయడం జరిగిందని అన్నారు.

అమె విదేశ పర్యటనలో వున్న సందర్భంలో సక్రమంగా వ్యవహరించలేదని ప్రధాని స్వదేశం తిరిగి వచ్చిన తరువాత ఉపప్రధానితోను, హోమ్ మంత్రితోను తన "అసంతృప్తి"ని వ్యక్త పరచిన మాట వాస్తవమేనా? అని శ్రీ ఎం. ఎల్. పోంతీ అడిగారు.

ఈ ఆరోపణను శ్రీ చావన్ గట్టిగా ఖండించారు. ప్రధాని కూడా అట్టివార్తలను ఖండిస్తూ ప్రకటన చేశారని శ్రీ చావన్ అన్నారు.

కేంద్ర హోమ్‌మంత్రి రాజీనామా చేయాలని శ్రీ పి. కె. వాసుదేవన్‌నాయర్ (కమ్యూనిస్టు) మహారాష్ట్ర సింగ్‌భర్తి (ఎస్. ఎస్. పి.) శ్రీ దెవెన్‌సేన్ (ఎస్, ఎస్, పి) కోరారు.

"నేను రాజీనామా చేసి వారి సూచనను ఆమోదించడంతోను" అని శ్రీ చావన్ అన్నారు.

ఇంద్రప్రస్థ సంఘటనలో పోలీసులు మితిమీరి ప్రవర్తించారనే విషయం తాను కాదనలేదని, "అది విజయం విదారకరం" అని శ్రీ చావన్ అన్నారు.

భవన్‌లో ప్రవేశించాలని అధికారులు నిర్ణయం గైకొన్నారని, ఆ నిర్ణయం పొరపాటు అని శ్రీ భవన్ వివరించారు. ప్రధాని సెప్టెంబరు 20 వ తేదీన ఇంద్రప్రస్థ భవన్ సందర్శించారని. ఒక నోటును తయారు చేశారని ఆయన అన్నారు.

## అలహాబాద్ యూనివర్సిటీలో పరిస్థితి

### పోలీసు చర్యలకు నిరసనగా విద్యార్థుల గైర్‌హాజర్

అలహాబాద్, నవంబర్ 15— యూనివర్సిటీ ఆవరణలోకి పోలీసులు మొన్న ప్రవేశించి కొంతమంది విద్యార్థులను ఉపాధ్యాయులను కొట్టారని ఆరోపిస్తూ, అందుకు నిరసనగా విద్యార్థులు మొన్నక్లాసులకు హాజరుకాలేదు.

కొద్దిమంది విద్యార్థులు యూనివర్సిటీ ఆవరణలో బట్టలు. బట్టులుగా తిరుగుతూ వైస్ - ఛాన్సలర్ వ్యతిరేక, పోలీసు వ్యతిరేక నినాదాలు చేశారు దాదా కాలలో ఉపాధ్యాయులు కూడా హాజరు కాలేదు.

ఒక సీనియర్ ప్రొఫెసర్ పత్రికల వారితో మాట్లాడుతూ పోలీసుల చేతులలో తమకు భద్రత లేదని భావించి పలువురు ఉపాధ్యాయులు యూనివర్సిటీకి హాజరు కాలేదు.

ఇది ఇలావుండగా పోలీసులు నిన్న ఉదయం యూనివర్సిటీ గేట్లవద్ద కావలా వున్నారు.

ప్రస్తుత పరిస్థితిని పరిశీలించడానికి వైస్-ఛాన్సలర్ నిన్న యూనివర్సిటీలో వివిధ శాఖల అధిపతులు సమావేశాన్ని ఏర్పాటుచేశారు. యూనివర్సిటీని మూసివేసే విషయంలో విన్నాభిప్రాయాలు వెలుబుచ్చిన కారణంగా ఈ విషయాన్ని సమావేశం కానున్న ఎగ్జిక్యూటివ్ చర్చిస్తుంది.

## "సేవాభావాన్ని అలవర్చుకోండి"

### బెంగాల్ యువకులకు శ్రీ వై. బి. చావన్ ఉద్బోధ

కలకత్తా, నవంబరు 15 — ప్రస్తుతం దేశంలో నిక్షిప్తదళము దాడుడానికి ప్రజలకు తోడ్పడేందుకు సేవాభావాన్ని, నాయకత్వ గుణాలను అభివృద్ధిపరచుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ వై. బి. చావన్ నిన్న యువతరానికి ఉద్బోధించారు.

కలకత్తా తూర్పు ప్రాంతంలోని ఎస్ప్రెస్ హైవేలో బి. సి. రాయ్ పిల్లల పార్కుకు శంకుస్థాపన చేసిన సందర్భంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని చెప్పారు.

వాతావరణం సరిగా లేకపోయినప్పటికీ పెద్ద సంఖ్యలో బాల బాలికలు ఆ ఉత్సవానికి హాజరయ్యారు.

బెంగాల్ నాయకత్వపు సంప్రదాయాన్ని డాక్టర్ రాయ్ అలవర్చుకున్నారని. వచ్చే యువతరం కూడా వారి సంప్రదాయాన్ని ఆదర్శంగా పెట్టుకుంటుందనే విశ్వాసం తనకుందని శ్రీ చావన్ అన్నారు.

తిరువేంద్రంలోని రాజభవన ఆవరణలో గల 25 సెంట్ల భూమిలో ఐ. ఆర్. 8 వరిపైరు వేయగా 726 కిలోల ధాన్యం పండినట్లు నవంబరు 14వ తేదీన విరుదలైన అధికార ప్రకటన వెల్లడించింది.

## "ఇజ్రాయెల్ పై దాడికి త్వరపడరాదు"

### అరబ్ - రిపబ్లిక్‌కు రష్యా హెచ్చరిక

బ్రెస్లేస్, నవంబరు 15 — ఇజ్రాయెల్‌పై త్వరపడి తగిన సన్నాహాలు లేకుండా దాడి చేయవలదని అరబ్ - రిపబ్లిక్ ప్రెసిడెంట్ నాసర్‌కు సోవియెట్ యూనియన్ హెచ్చరించింది.

మూడో కాల్వ వెంబడి ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య సంఘర్షణల వల్ల ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిన దృష్ట్యా క్రెమ్లిన్ ఈ హెచ్చరిక చేసినట్లు దౌత్యవర్గాలవారు చెప్పారు.

రానున్న మాసాలలో మరింత హెచ్చు సహాయం అందజేయగలమని ప్రెసిడెంట్ నాసర్‌కు రష్యా హామీనిచ్చింది. అరబ్ రిపబ్లిక్ సైనికోద్యోగులకు శిక్షణ సౌకర్యాలు కల్పించగలమని కూడా వారు చెప్పారు.

ఇజ్రాయెల్‌తో యుద్ధానికి అరబ్ రిపబ్లిక్ సిద్ధంగా లేదని, ఈ పరిస్థితులలో దాడికి దిగితే పెద్ద యుద్ధంగా పరిణమించగలదని రష్యా పేర్కొన్నది.

అరబ్ రాజ్యాలకు దౌత్య స్థాయిలో విషయం చేకూర్చే విమిత్తం ఇజ్రాయెల్‌పై వత్తిడి తీసుకొని రాగలమని కూడా రష్యా వాగ్దానం చేసింది.

## ఇజ్రాయెల్, జోర్డాన్ నౌకలమధ్య కాల్పులు

### పదిమంది జోర్డాన్ సైనికుల మృతి

అమ్మాన్, నవంబర్ 15— ఇజ్రాయెల్ సైనికులు నిన్న అర్ధరాత్రి జోర్డానదిని తూర్పు ఒడ్డును దాటడానికి ప్రయత్నించిన సందర్భంలో 35 నిమిషాలపాటు జరిగిన సంఘర్షణలో పది మంది జోర్డాన్ సైనికులు మరణించినట్లు మొన్న ఉదయం సైనిక ప్రతినిధి ఇక్కడ తెలియజేశారు.

అగ్నేయంగావున్న అడొనీయా ప్రాంతంలో జోర్డానదిని దాటడానికి ఇజ్రాయెల్ సేనలు ప్రయత్నించగా, వారిని విజయవంతంగా. త్రిప్పికొట్టినట్లు ఆయన తెలిపారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవం

### శ్రీ హుమయూన్ కబీర్‌చే ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబరు 15 — ప్రథమ జాతీయ గ్రంథాలయ వారోత్సవానికి పార్లమెంటుసభ్యులు ప్రొఫెసర్ హుమయూన్ కబీర్ నిన్న ఇక్కడ ప్రారంభోత్సవం చేశారు.

జాతీయాభివృద్ధి కృషిలో గ్రంథాలయాలు వహించే పాత్రను ప్రజల దృష్టికి తీసుకొచ్చేందుకు దేశ వ్యాపితంగా ఈవారోత్సవం జరుపుకున్నారు. ఈ వారోత్సవం సందర్భంగా బహిరంగసభలు, గోష్ఠులు, గ్రంథ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుసేన్ పంపించిన సందేశంలో, శ్రీ నెహ్రూ జన్మదినోత్సవం రోజునే ఈ వారోత్సవాలు ప్రారంభించడం తన కెంతో హర్షదాయకంగా వుందని తెలియజేశారు.

# చతుర్థ ప్రణాళికకు అవసరమైన పెట్టుబడి

## పన్నుల ద్వారా సమకూర్చుకొనడం అనివార్యమని శ్రీ కె. సి. పంత్ వివరణ

### సంపదను మరుగుపరచేవారిపై కఠిన శిక్షలు విధించడానికి అవకాశమిస్తున్న శాసనాలకు సమర్థన

న్యూఢిల్లీ, నవంబరు 15—

ఆర్థిక, సాంఘికలక్ష్యాలు నెరవేరడానికి పన్నుల వ్యవస్థ" ప్రధాన సాధనంగా" రూపొందినదని, విదేశసహాయం అనిశ్చితంగా వున్నప్పుడు ప్రగతి సాధనకై దేశీయ వనర్లను పెంపొందించుకొనడానికి దాన్ని ఉపయోగించడం తప్ప మార్గాంతరం లేదని కేంద్ర ప్రభుత్వం రెవిన్యూ శాఖ మంత్రి శ్రీ కె సి పంత్ స్పష్టం చేశారు.

భారత వాణిజ్య, పారిశ్రామిక మండలుల సమాఖ్య ఆధ్వర్యాన ఏర్పాటైన అఖిల భారత ఆర్థిక నిపుణుల సమావేశంలో ప్రసంగిస్తూ, కంపెనీల పన్నుల వ్యవస్థ విషయంలో శ్రీ భూతలింగం కమిటీ సమర్పించిన నివేదికపై నిర్ణయాలు తీసికొనడంలో ప్రభుత్వానికి ఈ సమావేశం నిర్ణయాల సహాయకారులు కాగలవన్న విశ్వాసాన్ని శ్రీ పంత్ వ్యక్తంచేశారు.

ఆదాయాన్ని లేదా సంపదను మరుగుపరచేవారిని శిక్షించడానికి అవకాశం కల్పిస్తున్న ప్రస్తుత శాసనాలను ఆయన గట్టిగా సమర్థించారు.

పన్నుల ద్వారా పుష్కలంగా నిధి చేకూర్చుకొనే బాధ్యతను ప్రభుత్వం విస్మరించజాలదని శ్రీ పంత్ ఉద్ఘాటించారు.

విదేశ సహాయం అనిశ్చితంగా వున్నదృష్ట్యా రానున్న కొంది సంవత్సరాలలో అంతరంగికంగా పొదుపు ద్వారా వీలైనంత హెచ్చు మొత్తాన్ని సమకూర్చుకొనవలసి వుండగలదని ఆయన హెచ్చరించారు.

స్వయం పోషకత్వాన్ని సాధించడాన్ని లక్షిస్తున్న చతుర్థ పంచవర్ష ప్రణాళికా కాలంలో పొదుపు ఏరిమితిని హెచ్చించడానికై ఆర్థిక శక్తిని పెంపుచేయడానికి తీవ్రతర కృషి జరపడం అత్యవసరమని పంత్ ఉద్ఘాటించారు.

పన్నుల రంగంలో సూచించగల కొత్త భారాలు, విధానాలు, ప్రభుత్వానికి హర్షదాయకమైనవి కాగలిగినప్పటికీ, పన్నుల ఎగవేతలను నిర్మూలించడానికి కఠిన చర్యలు అవలంబించడం తప్ప మార్గాంతరం లేదని ఆయన వివరించారు.

ఈ సమావేశంరెండు రోజులు జరుగుతుంది. ఇది కంపెనీల పన్నుల వ్యవస్థను ఆదాయం, సంపద పన్ను చట్టాలలోని కీలకవిందరనలను పన్నుదారుల విద్యను ముఖ్యంగా శ్రీ భూతలింగం నివేదికను ప్రధానంగా చర్చిస్తుంది.

శ్రీ భూతలింగం కమిటీ చేసిన సిఫారసులను వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, నిపుణుల అభిప్రాయాల దృష్ట్యా ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, వాటిపై సరియైన నిర్ణయాలు తీసికొనడంలో ప్రభుత్వానికి ఈ సమావేశం తీర్మానాలు సహాయకారులు కాగలవని శ్రీ పంత్ పేర్కొన్నారు.

### శ్రీ మోడి విజ్ఞప్తి

తొలుత భారత వాణిజ్య, పారిశ్రామిక మండలుల సమాఖ్య అధ్యక్షులు శ్రీ జి. ఎం, మోడి స్వాగతోపన్యాసమిస్తూ, కంపెనీల రంగం పురోగతికి ప్రోత్సాహకరంగా పన్నుల వ్యవస్థను సంస్కరించడానికి తీసుకొన దగు చర్యలను సూచించాలని సమావేశాన్ని కోరారు.

సంపద లేదా ఆదాయాన్ని మరుగుపరచినవారిని కఠినంగా శిక్షించడానికి అధికార మిస్తున్న నిబంధనల పట్ల భయ సందేహాలను వెలిబుచ్చుతూ సమావేశానికి కొందరు నిపుణులు వ్యాసాలు సంపినట్లు తెలుపుతూ, పన్నుల అధికారి తనకు విశేషాధికారాలుంటే వాటిని దుర్వినియోగపరచే అవకాశం వుండగలదని శ్రీ మోడి హెచ్చరించారు.

కంపెనీల పన్నుల రేటును 1963 పూర్వపు స్థాయికి పునరుద్ధరించాలని శ్రీ మోడి ప్రభుత్వాన్ని కోరారు.

సర్టాక్స్‌ను రద్దుచేయాలని కూడా ఆయన సూచించారు.

## రాజధానిలో పిల్లల దినోత్సవం

### నెహ్రూ పార్క్‌లో ప్రధాని ప్రభృతులచే 79 మొక్కల ఏర్పాటు

న్యూఢిల్లీ, నవంబరు 15— పిల్లల దినోత్సవం సందర్భంగా ఇక్కడ దాణీక్య పురిలోని నెహ్రూ పార్కులో శ్రీమతి ఇందిరా గాంధి, శ్రీ వి. వి. దాదన్, ఇతర ప్రముఖులు నిన్న 79 మొక్కలను నాటారు.

జవహర్‌లాల్ నెహ్రూ 79 వ జన్మదినోత్సవ చిహ్నంగా వారు ఆ 79 మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా శ్రీమతి గాంధి పిల్లలనుద్దేశించి ప్రసంగిస్తూ, తమ స్వంత కొలదగా భావించి ఆ మొక్కలను పెంచాలని కోరారు.

న్యూఢిల్లీ మునిసిపల్ కమిటీకి చెందిన వివిధ పాఠశాలలలోని సుమారు 15 వేల మంది పిల్లలు ప్రదర్శించిన నృత్య, గాన ప్రదర్శనలకు కూడా ప్రధాని, హోం శాఖ మంత్రి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

ప్రథమ భారత ప్రధాని నెహ్రూ ప్రవచించిన వాక్యాలు గల ఎనిమిది స్తూపాలను శ్రీమతి గాంధి ఆవిష్కరించారు. రెండు ఫౌంటెన్స్‌కు కూడా ప్రారంభోత్సవం చేశారు.

## ప్రపంచ సుందరిగా మిస్ ఆస్ట్రేలియా

### లండన్ పోటీలో ఎన్నిక

లండన్, నవంబర్ 15. మిస్ ఆస్ట్రేలియా పెనెలోపెప్లమ్మర్ నిన్న రాత్రి ఇక్కడి జరిగిన పోటీలో ప్రపంచ సుందరిగా ఎన్నికయారు.

మిస్ బ్రిటన్ రెండవ బహుమతి, మిస్ ఇజ్రాయెల్ మూడవ బహుమతిపొందారు.


## కె. సి. లాటరీ

(ఒరిస్సా ప్రభుత్వముచే కంట్రోలు చేయబడినది)

బ్రహ్మాండమైన

| | |
|---|---|
| మొదటి బహుమతి | రు. 1,15,000 |
| రెండవ బహుమతి | రు. 28,000 |
| మూడవ బహుమతి | రు. 10,000 |

మరియు అనేక ఇతర బహుమతులు ఇస్తున్నది.

డ్రా తేదీ: 29 డిసెంబరు 1968కి పొడిగించబడినది.

ప్రీ పెయిడ్ ఫారములు తీసుకొనుటకు చివర తేదీ 14 డిసెంబరు 1968.

| అవకాశం జారవిడువకండి. | | ఇదే కడపటిది కావచ్చు |
|---|---|---|
| ఒక టిక్కెట్టు | 1 | రూపాయి |
| 14 టిక్కెట్లకు | 10 | రూపాయలు |
| 350 టిక్కెట్లకు | 200 | రూపాయలు |

కె. సి. ఛారిటీస్ ఫండ్ లాటరీ,
బరంపురం (గంజామ్) ఒరిస్సా.



## డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చి లాబొరేటరి

ఫిసాల్‌బండా (పోస్టు), యాకుత్‌పుర హైదరాబాద్-23
(రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్)

భారత రాష్ట్రపతి తరపున ఈ క్రింద ఉదహరించిన బదములకు రిజిస్టర్డ్ గవర్నమెంట్ కంట్రాక్టర్లనుంచి హైదరాబాద్-23 డిఫెన్స్ మెటలర్జికల్ రిసర్చ్ లాబొరేటరీ డైరెక్టరు వారిచే సీలువేసిన టెండర్లు కోరబడుచున్నవి.

| వ.నం. | రిఫరెన్సు నం. | స్టోర్సు వివరం | ప్రమాణం |
|---|---|---|---|
| 1. | DMRL/ST/LP/P. MET/ 24-68 | విదిభాగాలతో ఆయిల్ సీల్ రోటరీ హైవాక్యూమ్ పంప్స్ | 2 Nos |
| 2. | DMRL/ST/LP/P. MET/ 14-68 | పారిఫీన్ టాంక్స్ ఎయిర్ టైట్ మూతలతో (610×610×610 mm) | 20 Nos |
| 3. | DMRL/ST/LP/P. MET/ 25-68 | (a) డైమండ్ పీస్స్ (b) హోంటెడ్‌పీస్స్—అంతా డైమండ్ | 4 Nos 8 Nos |
| 4. | DMRL/ST / LP/Ph. M/ 31-68 | 1% నిర్దిష్టతగల సెంసిటివిటీ కంట్రోలు గల సాఫ్ట్ ఎక్స్ ఫర్నెస్ గరిష్ట ఆపరేటింగ్ టెంపరేచర్ 1350 °C పాట్ కొలతలు 150mm Dia × 175 mm ఎత్తుతో 150 mm సార్ట్ లోతు | 1 No. |
| 5. | DMRL/ST/LP/Ph. M/ 30-67 | 1% ఒకటవ నంబరు నిర్దిష్టత గల సెంసిటివిటీ కంట్రోలుతో హారిజాంటల్ ట్యూబ్యులార్ ఫర్నెస్. మాక్సిమమ్ ఆపరేటింగ్ టెంపరేచర్ 1450 సె. డిగ్రీల యూనిఫారం హీటింగ్ జోన్: 75 mm కొలతలు 125 mm Q.D.X. × 50 mm I.D. × 250 mm పొడవు | 1 No. |

1968 నవంబరు 25 నాటికిగాని లేక అంతకు ముందుగా గాని హైదరాబాద్ — 23, ఫిసాల్‌బండ, యాకుత్‌పురా (పోస్ట్) డి ఎమ్. ఆర్. ఎల్. డైరెక్టర్ వారి మంచి నియమితమైన ఫారములను పొందవచ్చును టెండర్లను దాఖలు చేయడానికి 1968 డిసెంబరు 10 చివర తేదీ. కనిష్ఠ టెండరునుగాని లేక ఏ టెండరునైనా పూర్తిగానో పాక్షికంగానో ఎటువంటి కారణం చెప్పకుండానే స్వీకరించడానికి లేక నిరాకరించడానికి హక్కు నిలిచియుండుకొనడమైనది

davp 683 (599) 68



## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అడవి ఫలసాయముల వేలం

శ్రీకాకుళం పారెస్టు డివిజనుకు సంబంధించిన సం॥ 1968-69 రం. వికాయి కూపులు అనగా గుర్గిలంపోలు & స్మాలీ టింబరు, వంట చెరకు పాగిట్‌వుడ్. చేకు కన్వర్షను, వెదురు కూపులు. చిల్లర ఫలసాయం గుత్తలు తేది 17-11-1968 మధ్యాహ్నం 1 గంటకు శ్రీకాకుళం డిస్ట్రిక్టు పారెస్టు ఆఫీసరు లేక వారిచే నియమింపబడినవారు బహిరంగముగా వేలం వేయబడును. వేలం గుత్తల వివరములు, వేలం నోటీసు షరతులు శ్రీకాకుళం డిస్ట్రిక్టు పారెస్టు ఆఫీసువారి నుండి తెలిసికొనవచ్చును.

సంతకం టి రామకృష్ణ,
డిస్ట్రిక్టు పారెస్టు ఆఫీసరు,
శ్రీకాకుళం.



## వర్గీకృత ప్రకటన

### పాలసీ పోయినది

లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
(1956 జీవిత బీమా కార్పొరేషన్ ఆక్టు క్రింద స్థాపితము)

డివిజనల్ ఆఫీసు - మచిలీపట్టణము

శ్రీ నాగల్ వెంకట కృష్ణయ్య, పరిహపురం, తెలాపి తా॥ గుంటూరు జీవితం పై యూనిట్ ఇండస్ట్రియల్ & ప్రొడెన్షియల్ అసోసియేషన్ కం. బొంబాయివారు వారిచేసిన నెం. 85161414 పాలసీ పోయినదని తెలియజేసినందున ఈ తేదీ లగాయితు ఒక నెలలోగా మాకెట్టి ఆక్షేపణ చేరకపోతే డూప్లికేటు పాలసీ జారీ చేయబడును.

మచిలీపట్టణం, 16.11.68. ఎ. రామారావు డివిజనల్ మేనేజరు


## రాజ్‌ఘాట్ సమీపంలో "గాంధి దర్శన్"

### నిర్మాణానికి ప్రధాని ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబరు 15— గాంధిజీ జీవితాన్ని, సందేశాన్ని తెలియజేసే 'గాంధి దర్శన్' నిర్మాణానికి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధి నిన్న ప్రారంభోత్సవం చేశారు.

ఈ అంతర్జాతీయ ప్రాజెక్టు రాజ్‌ఘాట్ సమీపంలో నిర్మిస్తున్నారు. ఇందులో ఎనిమిది విభాగాలు ఉంటాయి. అంతర్జాతీయ విభాగం, ఆడిటోరియం కూడా ఉంటాయి.

## బిర్లా భవనం స్వాధీనం సమస్య

### పార్టీ నాయకునికి 20 మంది కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుల లేఖ

న్యూఢిల్లీ, నవం

# "బహుముఖ ప్రజ్ఞాశీలి, కళాతపస్వి రాజకీయ దురంధరుడు"

## పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన సభలో నెహ్రూస్మృతికి పలువురు నాయకుల జోహార్లు

### మొత్తం దేశంలో వైభవంగా 79 వ జయంతి

న్యూఢిల్లీ, నవంబర్ 14—

"బహుముఖ ప్రజ్ఞాపంతుడు, కళాకారుడు, రచయిత, విప్లవవాది, ప్రజాస్వామ్యవాది, మానవతావాది, రాజకీయవేత్త, పరిపాలనా దక్షుడు" అని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూకు నేడు ఆయన 79 వ జన్మదినోత్సవం సందర్భంగా పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన ఒక సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు జోహారు అర్పించారు.

లోకసభ స్పీకర్ శ్రీ ఎస్. సంజీవరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పిలుపెట్టి జవహర్‌లాల్ చిత్రపటాన్ని వేదికపై అందంగా అలంకరించారు.

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి కూడా హాజరయ్యారు. అయితే ఆమె తన తండ్రి స్మృతులను తలచుకొంటూ గద్గదికయై, కొంచెంసేపు ఏమీ మాటలాడకుండా మౌనంగా వున్నారు.

శ్రీయుతులు మురార్జీ దేశాయ్, జగ్‌జీవన్‌రామ్, ఆచార్య కృపలానీ, ఎస్, ఎం, జోషీ, సురేంద్రనాథ్ ద్వివేదీ, జగన్నాథరావుజోషీ, గంగాశరణ్ సిన్హా, వి. కె.కృష్ణమూర్తి, ఇసాక్ సంజాబీ ప్రభృతులు వ్యక్తిగత నెహ్రూ స్మృతికి జోహార్లు అర్పించారు.

నెహ్రూ జీవితం గురించి దేశానికి ఆయన చేసిన సేవల గురించి వక్తలు తమ 'ప్రసంగాల' వివరించారు, ప్రజలందరూ విభేదాలను విస్మరించి సమైక్యంగా వ్యవహరించడమే స్వర్గీయ నెహ్రూకు ఘనమైన నివాళి అని వారు పేర్కొన్నారు.

ఉప ప్రధాని శ్రీ మురార్జీ దేశాయ్ ప్రసంగిస్తూ. స్వాతంత్ర్యం సమరార్జితకాలముందు, తదువాత రోజులలోను పండిట్ నెహ్రూ చేసిన త్యాగాలను దేశ ప్రజలు ఎల్లప్పుడు స్మరిస్తూనే వుంటారని, తమ దేశానికి అంత ఘనంగా సేవచేసిన వ్యక్తులు ప్రపంచంలో బహు అరుదు అని జోహార్లర్పించారు.

ప్రస్తుతం ప్రేమ్ పాతుకున్న ప్రజాస్వామ్యానికి గట్టి పునాదిని నెహ్రూ ఏర్పరచారని, దేశ ఆర్థిక ప్రగతికి కూడా పునాది వేశారని ఆయన అన్నారు.

ప్రస్తుత తరంవారు, భావి తరంవారు కూడా నెహ్రూ అడుగు జాడలలో వ్యవహరించగలరన్న ఆశాభావాన్ని శ్రీ మురార్జీ వ్యక్తం చేశారు.

మాజీ కాంగ్రెసు అధ్యక్షుడు ఆచార్య కృపలానీ ప్రసంగిస్తూ, జవహర్‌లాల్ గొప్ప దేశ సంపన్నుడని, కళా తపస్వి అని అభివర్ణించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నో కలలు గన్నారని, అయితే వాటిలో ఎన్ని వాస్తవ రూపం దాల్చాయో ప్రజలు ప్రశ్నించుకొనాలని శ్రీకృపలానీ పేర్కొన్నారు.

## టిబెట్‌లో తిరుగుబాటు

### వెయ్యిమంది చైనీస్ సైనికుల వధ

తైపే, నవంబర్ 14— గత జూన్, జులై, ఆగస్టు మాసాలలో టిబెటన్‌లు తిరుగుబాటుచేసి వెయ్యి మందికిపైగా కమ్యూనిస్టు సైనికులను చంపివేసినట్టు గూఢచారి వర్గాల ద్వారా నేడు తెలియవచ్చింది.

అయితే ఈ సంఘర్షణలలో టిబెటన్‌ల నష్టాలను గురించి ఆ వర్గాలవారు పేర్కొనలేదు.

దక్షిణ టిబెట్‌లో గత జూన్‌లో మూడు వేల మంది టిబెటన్‌లు కమ్యూనిస్టు సైనికులపై దాడిచేసి దాదాపు 200మందిని చంపివేసినట్టు ఆ వర్గాల ద్వారా వెల్లడైనది.

మరొక చోట జరిగిన దాడిలో 300 మంది చైనీస్ సైనికులు మరణించారని కూడా వారు తెలియజేశారు.

## రైల్వే వర్క్‌షాపుల నిర్వహణ

### క్రమబద్ధం చేయడానికి రైల్వే వార్షులో పదేళ్ల పథకం

న్యూఢిల్లీ, నవంబర్ 14— అదనపు అవసరాలకు అనుగుణంగా రైల్వే వర్క్‌షాపుల నిర్వహణను క్రమబద్ధం చేయడానికి పది సంవత్సరాల పథకాన్ని రైల్వే బోర్డు రూపొందిస్తున్నది.

నే డిక్కడ జరిగిన భారత రైల్వేల చీఫ్ మెకానికల్ ఇంజనీర్ల సమావేశంలో ప్రసంగిస్తూ రైల్వేబోర్డు సభ్యుడు శ్రీ పి. సహాయ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

ఎక్కడ వర్క్‌షాప్ సౌకర్యాలను విస్తరించాలో, కొత్త వర్క్ షాపులకు ప్రారంభించాలో మున్నగు విషయాలను ఈ పథకం సూచిస్తుంది.

## కేంద్ర పరిశ్రమల రక్షణ దళం బిల్లు

### శ్రీ ఎస్. ఎం. బెనర్జీ సూచనకు డిప్యూటీ స్పీకర్ తిరస్కృతి

న్యూఢిల్లీ, నవంబర్ 14— కేంద్ర పరిశ్రమల రక్షణదళం బిల్లు, రాష్ట్ర అధికారాలను ఆక్రమించినదా అన్న విషయమై తన అభిప్రాయం తెలపడానికి అటార్నీ జనరల్‌ను పిలవవలసిందని శ్రీ ఎస్. ఎమ్. బెనర్జీ ప్రతిపాదించిన తీర్మానాన్ని డిప్యూటీ స్పీకర్ శ్రీ అర్. కె. ఖాదిల్కర్ నేడు లోకసభలో తోసివుచ్చారు.

అయితే బిల్లులోని రాజ్యాంగ సంబంధమైన అంశాలను సభకు వివరించడానికి అటార్నీ జనరల్‌ను పిలిపించాలని శ్రీ బెనర్జీ చేసిన సూచనను ఆయన ఆమోదించారు.

తొలుత ఈ బిల్లును హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ వి. సి. శుక్లా ప్రతిపాదిస్తూ, "బిల్లులో ఎట్టి రాజకీయాలు లేవు" అని అన్నారు.

## విదేశాలలో భారత ఇంజనీరింగ్ వస్తువులకు గిరాకి

### కొత్తగా 45 కోట్ల మేరకు ఆర్డర్లు వచ్చినట్టు వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 14— ఇండియా నుంచి 45 కోట్ల రూపాయల విలువ గల ఇంజనీరింగ్ వస్తువులను దిగుమతి చేసుకొనడానికి ఇటీవల 20 దేశాలు ఆర్డర్స్ పంపినట్లు అధికార రీత్యా తెలియ వచ్చింది.

ఈ ఏడాది ఆరు మాసాలలోను ఇండియా 39.34 కోట్లు విలువగల ఇంజనీరింగ్ వస్తువులను ఎగుమతి చేసింది.

కొత్తగా 45 కోట్ల రూపాయలు, ఇంజనీరింగ్ వస్తువులకు విదేశాలనుంచి ఆర్డర్స్ రావడంతో 1968-69 లో 80 కోట్ల విలువగల ఇంజనీరింగ్ వస్తువులను ఎగుమతి చేయాలన్న లక్ష్యాన్ని అందుకొనవచ్చునని ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతి అభివృద్ధి మండలి భావిస్తున్నది.

ఎలెక్ట్రికల్ పరికరాలకు సంబంధించి ఇండియన్ ఇంజనీరింగ్ సంస్థలకు ఎక్కువగా ఆర్డర్లు వచ్చినవి.

పోలాండుకు 2.50 కోట్ల మేరకు, హంగరీకి 7.50 కోట్ల మేరకు రైల్వే వ్యాగన్‌లను సరఫరా చేయడానికి ఉద్దేశించిన సంప్రతింపులు జరిగినవి.

## ఎన్నికల చట్టం సవరణ

### ఎట్టి ప్రతిపాదన ఎలెక్షన్ కమిషన్ చేయలేదని లోకసభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 14— ఓటింగ్‌ను నిర్బంధం చేసేందుకు వీలుగా ఎన్నికల చట్టాన్ని సవరించాలని సూచిస్తూ ఎట్టి ప్రతిపాదన ఎలెక్షన్ కమిషన్‌నుంచి అందలేదని న్యాయమంత్రి శ్రీ పి. గోవిందమీనన్ నేడు లోకసభలో తెలియజేశారు.

ఓటింగ్‌ను నిర్బంధం చేయాలని, ఓటు హక్కును వినియోగించనివారిపై చర్యలు గైకొనాలని ఇటీవల చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ చెప్పడం జరిగిందని శ్రీ గాది లింగన్న గౌడ్‌కు మంత్రి శ్రీ గోవిందమీనన్ చెప్పారు.

అయితే ఈ సూచనల పట్ల సర్వత్రా వైముఖ్యం కానవస్తున్నదని ఆయన అన్నారు.

## ఆహార ధాన్యాల సేకరణ తగ్గుదల

### లోకసభలో ఆహార మంత్రి శ్రీ షిండే వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 14— ఖరీఫ్‌పంట ఆహార ధాన్యాల సేకరణ 1967 నవంబరు ఒకటి నుంచి 1968 అక్టోబరు 31 వరకు నిర్ణయించిన లక్ష్యం కంటే చాలా తక్కువ జరిగింది.

ఈ కాలంలో 70 లక్షల టన్నుల ఆహారధాన్యాలు సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా, 39.84 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు సేకరించినట్టు కేంద్ర ఆహారశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఏ. పి. షిండే నేడు లోకసభలో ప్రకటించారు.

శ్రీ ఇంద్రజిత్ గుప్తా అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ, 51 లక్షల టన్నుల బియ్యం, 10.50 లక్షల టన్నుల జొన్నలు, 8.5 లక్షల టన్నుల ఇతర ఆహారధాన్యాలు సేకరించవలసివుండగా, 32.11 లక్షల టన్నుల బియ్యం, 3.93 లక్షల టన్నుల జొన్నలు, 3.80 లక్షల టన్నుల ఇతర ఆహారధాన్యాలు సేకరించినట్టు ఆయన వివరించారు.

వాతావరణం సరిగా లేనందున కొన్ని రాష్ట్రాలలో పంటలు దెబ్బతినడం కొన్ని రాష్ట్రాలలో అవిశ్రాంత రాజకీయ పరిస్థితులు, ఇందుకు ప్రధాన కారణాలని ఆయన చెప్పారు,

అయితే గోధుమ సేకరణ మాత్రం లక్ష్యం మించి జరిగిందన్నారు.

### ఎరువుల ధరలు

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని ఎరువుల ఫ్యాక్టరీలన్నీ ధరలను నిలబెట్టడంలో పరిధైన మార్కెట్ సూత్రాలను అనుసరించాలని సలహా యిచ్చినట్టు శ్రీ షిండే ఒక ప్రశ్నకు వ్రాత మూలంగా యిచ్చిన సమాధానంలో తెలియజేశారు.

## కేరళకు కేంద్రం రిజర్వ్ పోలీసు దళం

### ప్రభుత్వం వైఖరిపై లోకసభలో మంత్రి వివరణ

న్యూఢిల్లీ: నవంబర్ 15— కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె సందర్భంలో కేరళ ప్రభుత్వం అనుసరించిన వైఖరి కారణంగానే రాష్ట్ర ప్రభుత్వానికిముందుగా తెలియజేయకుండా కేంద్ర రిజర్వు పోలీసులను ఆ రాష్ట్రానికి పంపవలసి వచ్చినదని హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ వి. సి. శుక్లా నేడు లోకసభలో చెప్పారు.

ఏమైనా కేరళకు పంపిన కేంద్ర రిజర్వు పోలీసు దళం డి. ఐ. జి. వి రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఉద్యోగులతో సంప్రతింపవలసిందిగా కేంద్రం ఆదేశించినట్టు ఆయన తెలియజేశారు.

అంతకు ముందు మంత్రి ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ రాష్ట్రానికి కేంద్ర రిజర్వు పోలీసు దళాన్ని పంపడం కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం మధ్య సత్సంబంధాలను కాపాడడానికి తోడ్పడదని పేర్కొంటూ కేంద్ర రిజర్వు పోలీసు దళాన్ని ఎంపడానికి రాష్ట్రప్రభుత్వం అభ్యంతర చెప్పినదని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, తదితర సంస్థల పరిరక్షణకు రిజర్వు దళాలను పంపవలసివచ్చినదని శ్రీ శుక్లా తెలియజేశారు.

## యువకుని అరెస్టు

న్యూఢిల్లీ, నవంబర్ 15—కేంద్ర పరిశ్రమల భద్రతాదళం బిల్లుపై లోకసభ చర్చించే సందర్భంలో ఒక యువకుడు విజిటర్స్ గాలరీ నుంచి కరపత్రాలను విసిరాడు.

ఆ యువకుని కస్టడీలోకి తీసుకొన్నారు.

# వచ్చే ఏడాది రాష్ట్రాలకు కేంద్రంనుంచి అదనంగా 25 కోట్లు కేటాయింపు

## —ఫైనాన్స్ కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, నవంబర్ 14 —

అయిదవ ఫైనాన్స్ కమిషన్ తాత్కాలిక నివేదికను కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన ఫలితంగా 1969-70 లో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నుంచి అదనంగా 20 నుంచి 25 కోట్ల వరకు లభిస్తుంది.

శ్రీ మహావీర్ త్యాగి అధ్యక్షతనగల అయిదవ ఫైనాన్స్ కమిషన్ సమర్పించిన తాత్కాలిక నివేదికను కేంద్ర మంత్రి వర్గం నేడు పరిశీలించి ఆమోదించింది.

ఈ నివేదికను త్వరలో పార్లమెంట్‌కు సమర్పిస్తారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు కేంద్రం అందజేసే సహాయం రాజ్యాంగం 275 ఆర్టికల్‌క్రింద గ్రాంట్స్ ఇన్‌ఎయిడ్ రూపంలో వుంటుంది.

ఆదాయంపన్ను లేదా ఎక్సైజ్ పన్ను రూపంలో వచ్చే ఆదాయం పంపిణీకి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలో ఎట్టి మార్పును ఈ కమిషన్ సూచించలేదు.

ప్రస్తుతం ఈ మొత్తంలో నూటికి 80 వంతులు జనాభా ప్రాతిపదికపైన, మిగతా 20 వంతులు ఆయా రాష్ట్రాలలో వసూలు అవుతున్న ఆదాయం ప్రాతిపదికపైన పంపిణీ చేస్తున్నారు.

ఎక్సైజ్ పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో నూటికి 80 వంతులను జనాభా ప్రాతిపదికపైన, మిగతా మొత్తాన్ని వెనుకబడిన రాష్ట్రం ప్రాతిపదికపైన పంపిణీ చేస్తున్నారు.

## ఎలక్ట్రానిక్స్‌లో అభివృద్ధి

### ఉన్నత స్థాయి సమావేశంలో పరిశీలన

న్యూఢిల్లీ, నవంబర్ 14 — ఎలక్ట్రానిక్స్ అభివృద్ధికి సంబంధించి దేశం సాధించిన ప్రగతి పట్ల ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి అధ్యక్షతన నేడిక్కడ జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సంతృప్తిని వ్యక్తపరిచారు.

ఎలక్ట్రానిక్స్ అభివృద్ధికి సంబంధించి దాదా కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించడానికి శ్రీమతి ఇందిరా గాంధి ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

దాదా కమిటీ ఒక నివేదికను 1966 లో ప్రభుత్వానికి సమర్పించిన విషయం పాఠకులకు విదితమే.

ఎలక్ట్రానిక్స్ అభివృద్ధికి సంబంధించి పది సంవత్సరాల కార్యక్రమాన్ని ఈ కమిటీ తన నివేదికలో సూచించింది.

రక్షణ మంత్రి శ్రీ స్వర్ణసింగ్, రక్షణ ఉత్పత్తి స్టేట్ మంత్రి శ్రీ ఎల్. ఎన్. మిశ్రా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి డాక్టర్ రామ్ సుభగ్‌సింగ్, స్టేట్ మంత్రి శ్రీ బి. కె. గుప్తాల్, సైన్సు, టెక్నాలజీ కమిటీ చైర్మన్ డాక్టర్ నాగ్ చౌదురి, ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ ఆర్. వెంకట్రామన్, అణుశక్తి కమిషన్ చైర్మన్ డాక్టర్ విక్రమ్ సారాభాయ్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## బర్మాలో విప్లవ నాయకుడు డాక్టర్ నాగ్ వధ

రంగూన్, నవంబరు 14 —బహిష్కరింపబడిన బర్మా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు, విప్లవకారుల సెంట్రల్ మెడికల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ్ ఉరఫ్ టున్ మాంచ్ మరి పదకొండు మంది అనుచరులు ఈ నెల ఎనిమిదవ బర్మా సైన్యానికి చెందిన 77 డివిజన్‌తో జరిగిన సంఘర్షణలో మరణించినట్టు ప్రభుత్వం నేడొక ప్రకటన చేసింది.

ఇటంగు జిల్లాలోని పెయూ వట్టణంలో ఈ సంఘర్షణ జరిగింది.

డాక్టర్ నాగ్ మరణంతో విప్లవ కమ్యూనిస్టు పార్టీలో సమర్థుడైన డాక్టరు ఎవరూ లేకుండా పోయారు.

## రైలు గేటు గుండా లారీ దూసుకుపోగా ఒకని మృతి

### ఆకివీడు సమీపంలో దుర్ఘటన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

ఆకివీడు, నవంబర్ 14— గతరాత్రి పది గంటలకు కైకలూరు నుంచి ఆకివీడు వస్తున్న లారీ ఆళ్ళపాడువద్ద మూసివున్న రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌ను ఢీకొని, దానిమీద దూసుకుపోయిన దుర్ఘటనలో, రాత్రి డ్యూటీలో గేట్ వద్ద వున్న ఇద్దరు రైల్వేఉద్యోగులలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకనికి తీవ్రంగా గాయాలు తగిలాయి.

లారీ డ్రైవరు, లారీని అదుపుకుండా వేగంగా నెళ్ళి ప్రమాదస్థలికి రెండు మైళ్ళ దూరంలోవున్న ఆకివీడు హైస్కూల్‌వద్ద లారీని విడిచి పరారయ్యాడు.

ప్రమాద వార్త అందిన వెంటనే రైల్వే పి. డబ్ల్యు. ఐ. శ్రీ సి. జి. జె. మూర్తి, ఎ. పి. డబ్ల్యు. టి. శ్రీ సి. లక్ష్మయ్యగారు ప్రమాదస్థలికి వచ్చి తనిఖీ చేశారు. లారీని పోలీసులు స్వాధీనపరచారు.

తీవరం రైల్వే సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీ కొండలరావు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వర్ణాంతర వివాహ వ్యవస్థను ప్రోత్సహించడానికిగాను దంపతులలో ఒకరు హరిజనులకు చెందినవారైతే ఉభయులకు 5 వందల నగదు చెల్లించడానికి వారి పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యాలు కల్గించడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు కేరళ హరిజన సంక్షేమ మంత్రి శ్రీ ఏమ్. కె. కృష్ణన్ అన్నట్టు తిరువేంద్రం వార్త.

# రైతులకు హెచ్చుగా పరపతి సౌకర్యాలు

## వడ్డీ వ్యాపారులనుంచి పూర్తిగా విముక్తి కావించాలని శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఉద్బోధ

న్యూఢిల్లీ, నవంబర్ 15—

దేశంలో ఇప్పటికీ వడ్డీ వ్యాపారుల కబంధహస్తంలో చిక్కుకుని వున్న వ్యవసాయదారులకు పరపతి సౌకర్యాలను కల్పించే బాధ్యతను నిర్వర్తించాలని బ్యాంకింగ్ సంస్థలకు నేడు ఆహార, వ్యవసాయ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఉద్బోధించారు.

మొత్తం పరపతిలో కొంత భాగాన్ని వ్యవసాయ పరికరాల రూపంలో, మిగిలిన భాగాన్ని రొక్కం రూపంలో సమకూర్చవచ్చునని ఆయన సూచించారు.

వ్యవసాయ ఆర్థిక సహాయం, బ్యాంకుల పాత్ర అన్న అంశంపై ఏర్పాటుచేసిన విద్వద్గోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తూ జగ్‌జీవన్‌రామ్ ఇట్టి విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ ప్రజలకు పరపతి కల్పన పట్ల ప్రతికూల భావాన్ని విడనాడాలని కమర్షియల్ బ్యాంకులకు, ఇతర ఆర్థిక సహాయ సంస్థలకు శ్రీ జగ్‌జీవన్‌రామ్ హితవు చెప్పారు.

పారిశ్రామిక రంగానికి మంజూరుచేసే అప్పులకు ఎంత భద్రత కలదో గ్రామీణ ప్రజలకు ఇచ్చే ఋణాలకు కూడా అంత భద్రత కలదని ఆయన స్పష్టంచేశారు.

వ్యవసాయ దారుల పరపతి అవసరాలను తీర్చకపోతే ఆర్థిక పునర్నిర్మాణం అసాధ్యమని శ్రీ జగ్‌జీవన్‌రామ్ పేర్కొనిందారు.

వ్యవసాయ రంగం ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణంలో సముచిత పాత్రను నిర్వహించవలసినదని, కమర్షియల్ బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని ఆయన ఉద్బోధించారు. జనసమాజస్థాపన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయరంగాన్ని విస్తృతంచేయడానికి కేవలం సహకార బ్యాంకుల తోడ్పాటుచాలదని ఆయన స్పష్టం చేశారు.

పట్టణ, పారిశ్రామికరంగాలకు వర్తింపజేస్తున్న సూత్రాలను గ్రామీణరంగానికి విస్తరింపజేసిన పక్షంలో వ్యవసాయరంగానికి సహాయాన్ని అందించడంలో ఎదుర్కొంటున్న చిక్కులను కమర్షియల్ బ్యాంకులు అధిగమించగలవని ఆయన సూచించారు.

## ఖమ్మం జిల్లాకు ధాన్యం దొంగరవాణా

### కృష్ణాజిల్లా సప్లయి అధికారిచే రెండు లారీల పట్టివేత

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

బందరు, నవంబర్ 15— రెండు వందల ధాన్యం బస్తాలను దొంగరవాణా చేస్తున్న రెండు లారీలను విస్సన్నపేట-కృష్ణారావు పాలెం మధ్య కృష్ణా జిల్లా సప్లయి ఆఫీసర్ శ్రీ టి. మునిరత్నం. ఆయన సిబ్బంది సహాయంతో ఆ పి వే సి ధాన్యాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆ లారీలు ఖమ్మం సరిహద్దు వైపుకు వెళుతున్నాయి.

కృష్ణాజిల్లా సరిహద్దును దాటి ఖమ్మం చేరుకునే నిమిత్తం ఆ లారీదారులు రెండు దొంగ వే బిల్లులను వెంటవుంచుకున్నారని, వాటిలో ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాకు, రెండవది ఖమ్మ జిల్లాకు వెళ్ళడానికి ఉద్దేశించినట్టివని తెలుస్తున్నది.

విస్సన్నపేట పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ ద్వారా పదివేల రూపాయల విలువచేసే ధాన్యాన్ని కోర్టుకు అప్పగించడం జరిగింది.

## రాజమండ్రి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

### హాజరు కాకుండా ప్రతిపక్షం నిరసన

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

రాజమండ్రి, నవంబరు 15— రాజ్యలక్ష్మి మహిళా కళాశాల నిర్వహణకు అధికార పక్షం నుంచి మాత్రమే ఇద్దరు సభ్యులను మొన్న జరిగిన పురపాలక సంఘ సమావేశంలో అధ్యక్షులు ఎన్నుకొన్న చర్యకు నిరసనగా నిన్న జరిగిన సమావేశాన్ని అల్డర్‌మన్, శాసనసభ్యులతోసహా ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యులు బహిష్కరించారు.

ప్రతిపక్ష నాయకులు డాక్టర్ ఎ. బి. ఎన్ నాగేశ్వరరావు ప్రతిపక్షం నుంచి కూడా ఒక సభ్యుని ఎన్నుకోవాలని సూచించారు.

నిన్న జరిగిన కౌన్సిల్ సమావేశానికి పూర్తిగా అధికార పక్షమే హాజరైంది. ఆ సమావేశంలో జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీకి సభ్యులుగా శ్రీయుతులు మహమ్మద్ అబ్దుల్లా, వనం నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

మొన్న జరిగిన సమావేశంలో కళాశాల జనరల్‌బాడీకి శ్రీ బేరి ముత్యాలరెడ్డిని, శ్రీమతి తటవర్తి సత్యవతిని ఎన్నుకొన్నారు.

నాగవట్నం సమీపానగల కరువేలి గ్రామంలో నవంబర్ 13 వ తేదీన కర్రలతో, ఇతర ప్రాణాపాయకరమైన ఆయుధాలతో దొమ్మీకి గుమికూడిన దాదాపు 300 మంది వ్యవసాయ కూలీలను చెదరగొట్టడానికి పోలీసులు రెండుసార్లు బాష్పవాయువు ప్రయోగించేసి, లాఠీలను ఉపయోగించినట్టు తంజావూరు వార్త.

## ప్రభుత్వ డాక్టర్ల ప్రయివేట్ ప్రాక్టీసుపై నిషేధం ఉత్తర్వు

### స్టే మంజూరుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, నవంబర్ 15 — రాష్ట్రంలో ప్రభుత్వ డాక్టర్ల ప్రయివేట్ ప్రాక్టీసును నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు అమలు జరగకుండా స్టే మంజూరు చేయడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నేడు నిరాకరించింది.

ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌పాటిల్ మరి కొంతమంది అసిస్టెంట్ సర్జన్లు దాఖలు చేసుకున్న రిట్ పిటిషన్లను జస్టిస్ సాంబశివరావు త్రోసిపుచ్చారు.

ప్రస్తుత దశలో ఈ పథకంలో జోక్యం చేసుకొనడం సక్రమం కాదని, జోక్యం చేసుకొన్న పక్షంలో నవంబర్ 18 తేదీ నుంచి అమలులోకి వచ్చిన పరిస్థితులు, వైద్య పరిపాలన అస్తవ్యస్తం కాగలదని న్యాయమూర్తి సాంబశివరావు తమ తీర్పులో పేర్కొన్నారు.

కేసు తుది విచారణ డిసెంబర్ 16 వ తేదీన డివిజన్ బెంచి జరపగలదని న్యాయమూర్తి సాంబశివరావు ప్రకటించారు.

## డిసెంబర్ 27న పటౌడీ నవాబ్, షర్మిలాటాగోర్‌ల వివాహం

భోపాల్, నవంబర్ 15— ప్రసిద్ధ సినీ తార షర్మిలాటాగోర్, ప్రముఖ క్రికెట్ ఆటగాడు పటౌడీ నవాబ్‌ల వివాహం డిసెంబర్ 27 వ తేదీన కలకత్తాలోని వధువు నివాసంలో జరుగుతుంది.

## చేనేత పనివారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అసహాయ వైఖరి

### శాసనసభ్యుడు శ్రీ ప్రగడ కోటయ్య విమర్శ

హైదరాబాద్, నవంబర్ 15— సమాజంలో అల్ప సంఖ్యాక వరాల పట్ల ముఖ్యంగా చేనేత పనివారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అసహాయ ధోరణి కొనసాగుతున్నదని రాష్ట్ర చేనేత పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి, శాసన సభ్యుడు శ్రీ ప్రగడ కోటయ్య నేడిక్కడ విలేకరులవారికి వివరించారు.

రాష్ట్రంలోని రెండు ఎపెక్స్ చేనేత సహకార సంఘాలకు ఋణాలుగా ఇవ్వడానికి గత ఆగస్టులో కేంద్రప్రభుత్వం సమకూర్చినది. 15 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని సహకార స్పిన్నింగ్ మిల్స్‌లో నిల్వ వున్న సూదాను కొనుగోలు చేయడానికి ఎపెక్స్ చేనేత సహకార సంఘాలకు అవకాశం కల్పించడానికి ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చినట్టు చెప్పారు. మిల్స్ నిర్వహణకు నిధుల కొరతవల్ల రాష్ట్రంలోని సహకార స్పిన్నింగ్ మిల్స్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్టు ఆయన చెప్పారు.

ప్రతి సీజన్ ఆరంభమైనదనీ, బ్యాంకులకు అవసరమైన కనీస మెత్తాలు చెల్లింపుకు సంసిద్ధంగా వున్న పక్షంలో మిల్లులకు ఆర్థిక సహాయం సమకూర్చడానికి బ్యాంకులు సంసిద్ధంగా వున్నవనీ, అయితే అందుకు మిల్లులు సంసిద్ధంగా లేవని శ్రీ ప్రగడ కోటయ్య వివరించారు.

కేంద్రప్రభుత్వం సమకూర్చిన రు. 15 లక్షలు ఇంకా రాష్ట్ర ప్రభుత్వంచేతిలోనే వున్నదనీ, ఎప్పుడు మిల్లులకు అందజేయగలదో అనూహ్యంగా వున్నదనీ ఆయన పేర్కొన్నారు.

కరీంనగర్, నెల్లూరు, రాజమండ్రిలో కొత్తగా ప్రారంభం కానున్న మూడు కొత్త సహకార స్పిన్నింగ్ మిల్లులకు ఆర్థిక సహాయం సమకూర్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నందుకు శ్రీ కోటయ్య విచారం ప్రకటించారు. భవనాల నిర్మాణానికి, యంత్రాల కొనుగోలుకు ఇప్పటికే ప్రతి మిల్లు రు. 30 లక్షలు హెచ్చించాలని ఆయన పేర్కొన్నారు.

పై విషయాలను తెలియజేయడానికి వీరాల కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్స్ చైర్మన్ శ్రీ టి. కోటిపీరయ్యతోపాటు శ్రీ ప్రగడ కోటయ్య పరిశ్రమల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తిని కలుసుకొన్నారు.

# ప్రాథమికోపాధ్యాయుల వేతనాల సమస్య

## లోకసభలో ప్రతిపక్ష సభ్యులచే సావధాన తీర్మానం ప్రతిపాదన

న్యూఢిల్లీ, నవంబర్ 15—

ప్రాథమికోపాధ్యాయులకు సంబంధించిన కొఠారి కమిషన్ సిఫారసులను అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజరప నందుకు లోకసభలో నేడు విమర్శించారు

ఈ సమస్యపై మార్క్సిస్టు కమ్యూనిస్టు పక్ష సభ్యులు శ్రీ జ్యోతిర్మయి బసు, మరి ముగ్గురు ప్రతిపక్ష సభ్యులు కలసి సావధాన తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను ఆ తీర్మానంలో ప్రత్యేకంగా ఉటంకించి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ప్రాథమికోపాధ్యాయులు సమాజంలో నిర్లక్ష్యం చేయబడిన తరగతిగానే ఉండిపోయారని తెలియజేశారు.

కేంద్ర విద్యా శాఖ స్టేట్ మంత్రి శ్రీ భనవత్ ఆజాద్ సమాధానం చెబుతూ, ఆ సమస్య పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీకి సంబంధించినందున కేంద్ర ప్రభుత్వానికి కొన్ని పరిమితులు ఉన్నయని చెప్పారు.

కొన్ని రాష్ట్రాలు కమిషన్ సిఫారసులను ఆమోదించనప్పటికీ, ఉపాధ్యాయుల వేతనాల స్కేళ్ళను మెరుగుపరచడానికి అన్ని రాష్ట్రాలు చర్యలు తీసుకున్నాయి. అన్ని రాష్ట్రాలలోను ఉపాధ్యాయుల వేతనాల సాధ్యమైనంతవరకు పెంచేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ కృషి చేస్తూనే ఉంటుందని శ్రీ ఆజాద్ హామీ యిచ్చారు.

శ్రీ బసు మాట్లాడుతూ, మొత్తం ప్రాథమిక విద్యావిధానాన్ని ప్రభుత్వం గందరగోళపరచిందని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో అని ఆరోపించారు.

జనసంఘం పార్టీ సభ్యుడు శ్రీ చంద్ మాట్లాడు

# విశాఖ రేవుకు రెండవ డ్రెడ్జరు

## కలకత్తాలో 49 లక్షలకు కొనుగోలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విశాఖపట్నం, నవంబరు 15—కలకత్తా రేవు నుంచి రు 49 లక్షలకు ఒక పాత డ్రెడ్జెరును కొనుగోలు చేయడానికి ధరను పరిష్కారం చేసుకుని విశాఖపట్నం పోర్టు ట్రస్టు చైర్మన్ శ్రీ హెచ్. సాంబమూర్తి తిరిగివచ్చారు.

ఈ డ్రెడ్జెరు ఈ నెలాఖరులోగా ఇక్కడకు చేరగలదని ఆయన అన్నారు.

కలకత్తా నుంచి కొనుగోలు చేస్తున్న ఈ డ్రెడ్జెరును కలకత్తా పోర్టువారు రు. 40 లక్షలకు కొన్నారు.

అయితే ఇప్పటి ధరల ననుసరించి రు. 120 లక్షలుగా అంచనా వేశారు.

తరుగుదల కింద రు. 60 లక్షలను తగ్గించి రు. 60 లక్షలకు విక్రయించజూపారు.

దేశం జరిగిన విపత్తు మరి రు. 11 లక్షలను తగ్గించి రు. 49 లక్షలకు విశాఖపోర్టు ట్రస్టుకు విక్రయించడానికి పరిష్కారం కుదిరినది.

ఈ డ్రెడ్జెర్‌ను వీలైనంత కోతను నివారించేందుకు ఉపయోగిస్తారు.

## తుపానుకు గురైన కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలకు సహాయం

### మంత్రి తిమ్మారెడ్డి హామీ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విశాఖపట్నం, నవంబర్ 15—తుపాను వల్ల నష్టపడిన శ్రీకాకుళం కృష్ణాజిల్లాలలోని ప్రజలకు సమకూర్చే సహాయం విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి హామీఇచ్చారు.

శ్రీకాకుళం జిల్లాలో తుపానువల్ల సంభవించిన నష్టాన్ని పరిశీలించడానికి ముఖ్యమంత్రి పంపగా వచ్చిన శ్రీ తిమ్మారెడ్డి ఇచ్చాపురం, సోంపేట, పెద్దకలి తాలూకాలలో తమ మూడు రోజుల పర్యటనకు మొన్న ఇక్కడకు వచ్చారు.

రెవిన్యూబోర్డు సభ్యులు శ్రీ ఆర్. విఠల్‌రావు, రాష్ట్ర అసెంబ్లీకి ప్రతిపక్షం నాయకులు శ్రీ గౌతు లచ్చన్న, కలెక్టర్ శ్రీ బి. ఆర్. కె. రావు, జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీ జి. శ్రీరాములు నాయుడు, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బి. రామగోపాలరావు, శాసనసభ్యులు, సమితి అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లాలోని ఇతర నాయకులు కూడా మంత్రి శ్రీ తిమ్మారెడ్డితోడ తుపానుకు గురైన ప్రాంతాలలో పర్యటించారు.

నష్టపడిన ప్రాంతమంతా దీపత్వంగా యుద్ధానంతరం రణరంగంలా వున్నదని ఈదులవురం తదితర పదిహేను గ్రామాల్ని రూపుమాపి కలచివేస్తున్నదని శ్రీ తిమ్మారెడ్డి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకు అటువంటి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడలేదని, పేద్దవు నీటివనరులు వెయ్యింటికి పైగా గట్లు తగిలినవని, 1924 లో వచ్చిన తుపానువలన 15 వేల ఎకరాలలో వంటపూర్తిగా ధ్వంసమైయాయని, ఉద్దానం ప్రాంతంలో వేమూడు లక్షల కొబ్బరిచెట్లు నేల కూలాయని, అయిదువేల ఎకరాలలో చెట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు.

చెట్లు, పశువులు, ఇళ్ళకు వాటిల్లిన నష్టం కొంతవరకు తీవ్రంగానే వున్నా ఎక్కువ నష్టం మత్స్యకారులు పొందారని, బర్మా నుంచి వచ్చిన నిర్వాసితులకు చెప్పుకోదగిన జీవనాధారం ఏమీ లేదని అటువంటి వారికి కూడా అపార నష్టం కలిగిందని ఎనిమిది నుంచి 12 ఏళ్ళ వరకు ఆ నష్టం పూడే సూచనలేదని శ్రీ తిమ్మారెడ్డి అన్నారు.

చేయబోయే సహాయక తర్యలు ఎలా వుంటాయని ప్రశ్నించగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఈ తుపాను బాధితులకు వారం రోజులో సహాయం అయితే మూడు వారాల పాలో తిండి పెట్టగలడేమోకాని కోటాది రూపాయల నష్టం పొందిన వారికి కష్ట నష్టాలను తీర్చగల వారెవరు అని ఆయన ఆందోళనతో సమాధానం చెప్పారు.

చెరువులకు, పేద్దవు వనరుల బాగుచేతలకు 30 లక్షలు ఖర్చుచేయడం జరుగుతుందని, కొబ్బరి చెట్లు నష్టపోయిన వారికి మొక్కలకు అప్పులు ఇస్తారని ఆయన వెల్లడి చేశారు.

శ్రీకాకుళం జిల్లా బారువా నర్సరీలో 30 వేల మొక్కలున్నాయని వాటన్నిటిని తక్షణమే పంపడం జరుగుతుందని, అవసరమైతే లక్ష మొక్కలు కావలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పాడి పశువులను ఎక్కడ కొనుక్కోవేందుకు అప్పులు ఇస్తామని, ఇళ్ళు వరదలు కోల్పోయిన మత్స్యకారులకు సంపూర్ణ సహాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

గాయపడిన వారికి అవసరగతులైన వారికిచేసే సహాయంపై నిర్ణయాలు అక్కడికి అక్కడే తీసుకోవడం జరిగినదని ఆయన చెప్పారు.

కష్టాలలో వున్న ప్రజలకు సహాయం చేయడంలో ఉత్తమంగా కృషిచేసినందుకు ఆయన రెవిన్యూబోర్డు సభ్యుని, జిల్లా కలెక్టరును, ఇతర సిబ్బందిని ప్రశంసించారు.

బాటిల్లిన నష్టపరిమాణంద్యన్యాశేంద్రం కూడా సహాయం చేయగలదన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తంచేశారు.

తుపాను బాధితులకు సహాయంచేసేందుకు వృత్తుందపేనాసంస్థలన్నీ ఇతోధికంగా నిరాశాలు ఇవ్వవలసిందని ఆయన విజ్ఞప్తి చేశారు.

### జిల్లా అధికారుల కృషికి శ్రీ తిమ్మారెడ్డి ప్రశంస

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

శ్రీకాకుళం, నవంబరు 15—శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల వచ్చిన తుపాను వలన నష్టపడినవారికి సహాయ సమకూర్చడం అత్యంత సమర్థనీయంగా కలుగజేసినందుకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి మొన్న ఇక్కడ జిల్లా పరిషత్ సభ్యుల సమావేశంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికార అనధికార ప్రముఖులను ప్రశంసించారు.

జిల్లాలో యాతాత పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి సమక్షాన శ్రీ తిమ్మారెడ్డి రెవిన్యూ సభ్యులు శ్రీ విఠల్‌రావు ఈ జిల్లాలో పర్యటించిన సంగతి పాఠకులకు విదితమే.

తన పరిశీలన పై 15 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చలు జరుగుతాయని నిర్ణయం కూడా అప్పుడే గైకొనడం జరుగుతుందని శ్రీ తిమ్మారెడ్డి చెప్పారు.

పార్లమెంటు సభ్యులు ఆచార్య రంగా, శ్రీ కె. నారాయణరావులను ఆ ప్రాంతంలో పర్యటించి పరిస్థితులను ప్రధాన మంత్రికి, ఉప ప్రధానికి ఎప్పటికప్పుడు చేయగల సత్వర సహాయానికై ఒప్పించవలసినదిగా శ్రీ తిమ్మారెడ్డి కోరారు.

తక్షణం తీసుకొన తగు సహాయక చర్యల గురించి శ్రీ జి. లచ్చన్న, శ్రీ కె. నారాయణరావు కూడా ప్రసంగించారు.

బందరువద్ద కప్పలదొడ్డి చేనేత పారిశ్రామికుల సహకార కాలనీలో అతివృష్టివల్ల నీరు నిలిచినప్పటి దృశ్యం

## కాకినాడలో లక్ష్మీ రాజేశ్వరి హత్యకేసు

### ముగ్గురికి శిక్ష విధిస్తూ సెషన్స్ జడ్జి తీర్పు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజమండ్రి, నవంబరు 15— లక్ష్మీ రాజేశ్వరీ హత్య కేసులో తమ తీర్పును అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ ఎమ్. ఎ. ఖదీర్ ఖాన్ నిన్న ప్రకటించారు.

చేబోలు అన్నాజీరావు అతని భార్య లక్ష్మీరాజ్యాన్ని హత్యచేసినందుకు అతనికి యావజ్జీవ కారాగారవాస శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రెండవ నిందితుడు చేబోలు సుబ్బారావు, మూడవ నిందితుడు చేబోలు నాగరత్నంకు మూడేసి నెలల చొప్పున కఠిన కైదు శిక్షను విధించారు. నాలుగవ నిందితుడు చేబోలు రమణారావును విడిచిపెట్టారు.

ఈ హత్య కాకినాడలో ఈ ఏడాది జూన్ 17 వ తేదీ రాత్రి జరిగింది.

### కేసు వివరాలు

తూర్పుగోదావరి జిల్లా అదనపు సెషన్సు జడ్జి శ్రీ ఎం. వి. ఖాదర్ ఖాన్. కాకినాడలో చేబోలు అన్నాజీరావు, అనే యువకుడు చేబోలు లక్ష్మీరాజేశ్వరి అనే తన భార్యను గత జూన్ 17 వ తేదీ రాత్రి హత్య చేశాడనేఅభియోగంతో 302 భారత శిక్షాస్మృతి కింద విచారించారు.

ఈ కేసులో చేబోలు అన్నాజీరావు మృతిచెందినయువతికి భర్త మొదటి నిందితుడు మొదటి నిందితుని తండ్రి చేబోలు సుబ్బారావు రెండవ నిందితుడు. మొదటి నిందితుని తల్లి చేబోలు నాగరత్నం మూడవ నిందితురాలు. మొదటి నిందితుని తమ్ముడు చేబోలు రమణారావు నాలుగవ నిందితుడు.

### ప్రాసిక్యూషన్ కథనం

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున 13 మంది సాక్షులను విచారించారు.

ప్రాసిక్యూషన్ కథనంప్రకారం, "చేబోలు అన్నాజీరావు వివాహం లక్ష్మీరాజేశ్వరితో ఏడాదిక్రితం జరిగినది. వివాహమైనప్పటినుంచి భార్యాభర్తల మధ్య పొత్తు సరిగా లేక తరచు ఏదో కలహాలు వస్తున్నాయి.

"అన్నాజీరావు కుటుంబంలోని వారంతా కూడా లక్ష్మీరాజేశ్వరి తన పట్టింటినుంచి కట్నం ఏమీ తేలేదని అవమాన పరచేవారు. లక్ష్మీరాజేశ్వరి కూడా తన భర్తను విముఖుడుగా అని తరచు నిందించేది.

"జూన్ 17 వ తేదీ రాత్రి మొదటి నిందితుడు అన్నాజీరావు, లక్ష్మీరాజేశ్వరి వారువున్న మేడ కిందభాగంలో పడుకున్నారు. మేడపైన రెండు, మూడు, నాలుగవ నిందితులు పడుకున్నారు.

"ఆ రాత్రి పది గంటలు దాటి తెల్లవారుఝామున నాలుగు గంటల మధ్య మొదటి నిందితుడు తన భార్యను ఏ కత్తితోనో పొడిచాడు.

"తనపై అనుమానం లేకుండా వుండేందుకై వృత్తి శ్రీ చేతి వ్రేళ్ళను కరెంటు తీగలకు పెట్టి కాల్చాడు."

ఈ కేసులో ఒకటి నుంచి నాలుగువ నెంబరు నిందితులపై ఈహత్య నేరాన్ని దాచిపెట్టిన నేరాన్నికూడా మోపారు.

### విచారణాంశాలు

కేసు విచారణలో ఈ కింది అంశాలు వున్నాయి:

"మృతిచెందిన యువతి లక్ష్మీరాజేశ్వరి. మొదటి నిందితుడు ఆమె భర్త ఆ రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఆ ఇంటిలో వున్నాడు. అప్పటికి ఆమె ఆరోగ్యంగా వున్నట్టు తెలిసినది తనకు కడుపునొప్పి అని ఆమె ఎవరితోను చెప్పలేదు.

"రాజేశ్వరి ఆ రాత్రి తన భర్తతో కలిసి పడుకోలేదని, ఎవరో బందువులతో కింద పడుకుందనిది. అమాంతా పైన పడుకున్నాడని ముద్దాయిలు కొందరితో చెప్పారు. కాని ఒకటవ నిందితుడు శవపంచాయితీలో తాను, రాజేశ్వరి రాత్రి 11.35 గంటలకు పడకగదిలో పడుకొన్నట్టు, మొట్టమొదటగా తెల్లవారుఝామున నాలుగు గంటలకు భార్య శవాన్ని తానుచూసినట్టు చెప్పాడు.

"లక్ష్మీరాజేశ్వరి తల్లిదండ్రులు ఈ మరణ వార్త విని రాజమండ్రి నుంచి కాకినాడ వచ్చేవరకు చుట్టుప్రక్కలవారికి ఆ ఇంట్లో లక్ష్మీరాజేశ్వరి చనిపోయినట్టు ఏ అలజడిగాని, ఏడ్పులు కాని వినిపించలేదు. కొద్ది మంది బందువులతో. చనిపోయినట్టు అప్పలరాజుతో రెండవ నిందితుడు తమ కోడలు కడుపు నొప్పితో చనిపోయినదని చెప్పాడు.

"లక్ష్మీరాజేశ్వరి తల్లి తమ పిల్లచేతులు కాలినట్టు వున్నాయేమని అడుగగా, కరెంటు షాక్‌వల్ల మరణించినదని మొదటి నిందితుడు చెప్పాడు. మెడమీద రక్కులు తన బడకుండా చమువు రానివున్నది. దెబ్బలు ఎలా తగిలాయో ఆ పిల్ల తల్లిదండ్రులకు ఆ ఇంట్లో ఎవరు సంజాయిషీ చెప్పలేదు. మృతి స్త్రీ తల్లిదండ్రులు రాకుండానే శవాన్ని తీసుకుపోయే విమిత్తం బాలాశిక్షంత్రీలు అన్నీ ఏర్పాటు చేశారు.

"డాక్టరు తన నివేదికలో పీక నులమడంవల్ల మరణం సంభవించినదని చెప్పారు.

"శవం సాధారణంగా వెనుకకొడ్డో కూర్చుండబెట్టి వున్నది. చనిపోయినవెంటనే కాకపోతే అలా కూర్చోబెట్టడం సాధ్యం కాదు. (వారి కులాచారం ప్రకారం శవాన్ని కూర్చోబెడతారు, కాని వండుకోబెట్టరు.

"విద్యుదాఘాతంవల్లకాని, కడుపునొప్పి వల్లకాని ఎప్పటో ఆమె చనిపోయివుంటే శవాన్ని అలాకూర్చోబెట్టడం సాధ్యంకాదు. సాధారణ పరిస్థితులలో చనిపోయివుంటే చని పోతుందని ముందు తెలిసే వీధిలో అయినా ఉంచుతారు. లేదా ఇంట్లో అయినా పడిపేస్తాడుకాని వెనుకకొడ్డో కూర్చోబెట్టడం సాధారణంగా జరుగదు."

శ్రీ ఎస్. ఆర్. కె. హనుమంతరావు ప్రాసిక్యూషన్‌ను నడపగా శ్రీ జి. ఎస్. కృష్ణ నిందితుల తరపున వాదించారు.

## నరసాపురంలో రోడ్ల బాగుసేతకోసం లక్ష

### మంజూరుకై మునిసిపల్ డైరెక్టరుకు విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" విలేకరి) నరసాపురం, నవంబరు 15—

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో అధ్వాన్నస్థితిలోవున్న రోడ్ల బాగుసేతకోసం లక్ష రూపాయల అప్పు ఇప్పించడానికి తోడ్పడవలసిందిగా మొన్న స్థానిక పురపాలక సంఘంవారు రాష్ట్ర మునిసిపల్ శాఖ డైరెక్టరుకు విజ్ఞప్తి చేశారు.

ఇక్కడకు వచ్చిన మునిసిపల్ పరిపాలనా శాఖ డైరెక్టరు శ్రీ ఎం. లోకనాథం గారికి మునిసిపల్ కౌన్సిలు చైర్మన్ శ్రీ చెరుకూరి లక్ష్మణరావు వినతిపత్రాన్ని సమర్పించారు.

పురపాలకసంఘం ఆర్థిక పరిస్థితి తీవ్రమైన సంక్షోభంలో వున్నదని, తమకు కొంతవరకు సహాయకారిగా నరసాపురం "పెద్ద"ని హైవేసు శాఖ నుంచి తమకు ఇప్పించేటట్టు సిఫార్సు చేయవలెనని, ప్రభుత్వం నుంచి విద్యా గ్రాంట్లు వచ్చేట్టు తోడ్పడవలెనని వినతిపత్రంలో అభ్యర్థించారు.

పురపాలకసంఘం కార్యాలయం హైవేసు డిపార్టుమెంటువారు తమకుఇచ్చిన విశ్రాంతి భవనం ఆవరణంలో నిర్మించనున్నట్టు, ఇందుకు ప్రభుత్వం ఇదివరలో రు. 20 వేల ఋణాన్ని మంజూరు చేసినట్టు తెలిసి మరి 80 వేల రూపాయలు కావలెనని వారు సూచించారు.

ప్రస్తుతం కంపోస్టును విల్వ చేయడానికి పురపాలకసంఘానికి సరయిన స్థల లేదని, స్థలం కొనుగోలుచేసి, కంపోస్టువలన ఆదాయాన్ని అభివృద్ధిచేసికోవడానికి రు 30 వేలను ట్రాక్టరు కొనుగోలుకు రు 40 వేలను ఇప్పించవలెనని కూడా డైరెక్టరును కోరారు.

డైరెక్టరు శ్రీ లోకనాథం తాము తమకు అభ్యర్థనలను పరిశీలించి సహకార మెరుగ్గలమని చెప్పారు. వృత్తి పన్నుల హెచ్చింపు ద్వారా, ఇతర మార్గాల ద్వారా పురపాలక సంఘం ఆదాయాన్ని పెంచుకోవలసిన అవశ్యకతను ఆయన వివరించారు. షెడ్యూల్డు బ్యాంకులు నుంచి పురపాలకసంఘాలు ఋణాలను తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చునని ఆయన చెప్పారు.

శ్రీ లోకనాథం ఇక్కడకు రాగానే సెక్రటరీ శ్రీ పి. కాశీకృష్ణరావు స్వాగతం పలికారు.

## వెంకటాయపాలెం హత్యకేసులో తీర్పు

### ముద్దాయిలపై ఆరోపణల కొట్టివేత

కడప, నవంబరు 15—వెంకటాయపాలెం హత్య కేసులో కడప జిల్లా రెండవ అదనపు జిల్లా సెషన్సు జడ్జి మొన్న ముద్దాయిలపై గల ఆరోపణలన్నిటిని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు.

వెంకటాయపాలెంకు చెందిన కొలవర్తి నర్సింహులుచెట్టిని కుట్రతోను, అన్యాయంగాను గుమికూడి హత్య చేశారని తొమ్మిది మంది ముద్దాయిలపై ఆరోపించబడింది.

సహేతుకమైన సంశయాన్ని మించి ప్రాసిక్యూషన్‌వారు ముద్దాయిలపై నేరారోపణ చేయలేకపోయారని హత్య చేసి వుండ వచ్చునన్న అనుమానంతో ఆరోపణ జరిగిందని, ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారి సాక్ష్యం కూడా వచ్చినట్టు కథగా కనబడుతున్నదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

## హరిజన క్రైస్తవ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

### తెనాలి సభ అభ్యర్థన

తెనాలి, నవంబరు 15—గుంటూరు జిల్లా హరిజన, హరిజన క్రైస్తవ కార్యకర్తలు ఇటీవల ఇక్కడి మిషన్ కాంపౌండులో సమావేశమయ్యారు. సమావేశానికి హరిజన ప్రముఖులు శ్రీ లంకపల్లి రాఘవయ్య అధ్యక్షత వహించగా, క్రైస్తవ ప్రముఖులు శ్రీ దోనేపూడి సుదర్శనం సభను ప్రారంభించారు.

సమావేశకర్త శ్రీ చిన్నం సుబ్బారావు సమావేశం ముఖ్యోద్దేశాన్ని కార్యకర్తలకు స్థూలంగా వివరించారు. సర్వశ్రీ బత్తుగు పీటర్, జి. దానియేల్, పి. బెంజిమెన్, అశోక రత్నకవి, పాల్సన్‌రాజ్ తదితర పెద్దలు దళితజాతుల భావి కార్యక్రమాన్ని చర్చించారు.

హరిజన విద్యార్థులకు అందిస్తున్నట్టే స్కాలర్‌షిప్పులను హరిజన క్రైస్తవ విద్యార్థులకు కూడా ఇవ్వవలెనని, దళిత జాతులపట్ల జరుగుతున్న అత్యాచారాలకు బాధ్యులైన వ్యక్తులను తీవ్రంగా దండించవలెనని, ప్రస్తుతం అమలులోవున్న రిజర్వేషన్ విధానాన్ని మరి పది సంవత్సరాలపాటు కొనసాగించవలెనని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

## అంతర్జాతీయ నాటక సంఘం

### రాష్ట్ర గవర్నర్ చే ప్రారంభోత్సవం

హైదరాబాద్, నవంబర్ 15—అంతర్జాతీయ నాటక సంఘానికి మొన్న గవర్నర్ శ్రీ ఖందూభాయ్ దేశాయ్ ప్రారంభోత్సవం చేశారు.

ప్రపంచంలో నాటక, సంగీత, నాట్యకళల పురోభివృద్ధికి, వివిధ దేశాల కళాకారుల మధ్య సంబంధాలు అభివృద్ధివరచడానికి ఈ సంఘం కృషిచేస్తుంది.

ఇండియాకు చెందిన శ్రీ ఎ.ఆర్. కృష్ణ, శ్రీ వి. కృష్ణరాజు, శ్రీ మార్కండ్‌భట్, శ్రీ మనుసుఖ్ జోషి ఇజ్రాయెల్‌కు చెందిన శ్రీ శామ్యూల్ అజ్రేల్ ఈ సంఘం కృషిలో తోడ్పడతారు.

## బయ్యవరం బంజారా తండాలో 18 ఇళ్ళు దగ్ధం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

ఖమ్మం, నవంబరు 16— సుదిమళ్ళ పంచాయతీ సమితిలోని బయ్యవరం గ్రామానికి చెందిన బంజారా తండాలో ఇటీవల 18 ఇండ్లు అగ్నికి దగ్ధమయాయి

ఆరు పుట్ల వడ్లు, అయిదు వేల రూపాయల నగదు, ఇంకా ఇతర వస్తువులు కలుపుకొని పదిహేనువేల రూపాయలవరకు నష్టాన్ని అంచనావేశారు.

ఇల్లందు తహశీల్దారు, సుదిమళ్ళ పంచాయతీ విస్తరణాధికారి కలుసు అందగానే అక్కడికి వెళ్ళారు.

## రాష్ట్ర రెవిన్యూ మంత్రి నెల్లూరు జిల్లా పర్యటన వాయిదా

హైదరాబాద్, నవంబర్ 15— రాష్ట్ర రెవిన్యూ, సివిల్ సప్లయి శాఖల మంత్రి శ్రీ వి. వి. రాజు నవంబర్ 19 న జరుపనున్న నెల్లూరు జిల్లా పర్యటనను నవంబర్ 21 వ తేదీకి వాయిదా వేశారు.

## శ్రీ సీతారామమూర్తి మృతికి తునిలో సంతాపం

తుని, నవంబరు 15— విడదవోలు జమిందారు రాజా చింతలపాటి సీతారామమూర్తి మృతికి సంతాపసూచకంగా మొన్న ఇక్కడ వస్త్ర, కిరాణా, బియ్యం కొట్లను మూసివేశారు. పట్టణంలోని తుని రాజావారి ఉన్నత పాఠశాలను మూడు రోజులపాటు, ఇతర పాఠశాలలను ఆ రోజున మూసివేశారు.

## మహిళా మండలి

కొత్తగూడెం, నవంబరు 15— బూర్గంపాడు మహిళా మండలి శ్రీ. శివన ఛాయాధికారి కుమారి వై. వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మొన్న సమావేశమయినది. కుమారి ఇ. పాపమ్మ ప్రసంగించారు.

అధ్యక్షురాలు శ్రీమతులు కె. సుపాకమ్మ, ఉపాధ్యక్షురాలు, కోశాధికారిగా శ్రీమతి ఇసానిపల్లి శివమ్మ, కార్యదర్శినిగా శ్రీమతి తోకల పుల్లమ్మ ఏకగ్రీవంగా నూతన కార్యవర్గానికి ఎన్నికయారు. మరి 23 మంది సభ్యులను కార్యవర్గానికి ఎన్నుకొన్నారు.

## వివాహమహోత్సవం

విజయవాడ, నవంబరు 15— స్థానిక ప్రముఖ వైద్య వ్యాపారి జనాబ్ సయద్ ఖాసిం సాహెబ్ పుత్రికను జనాబ్ అబ్దుల్ జలీల్ సాహెబ్ పుత్రుడు చిరంజీవి గులాం మొహిద్దీన్‌కు ఇచ్చి నేటి ఉదయం ఇక్కడి లబ్బీపేటలో "విజా" వివాహమహోత్సవం వైభవోపేతంగా చేశారు. పెక్కు మంది ప్రముఖులు హాజరయి వధూవరులను ఆశీర్వదించారు.

## గుంటూరులో కలప వర్తకులకు లైసెన్సులు

విజయవాడ, నవంబరు 15—గుంటూరు మునిసిపాలిటీ వారు పట్టణ కలప వ్యాపారులకు లైసెన్సులు ఇవ్వడానికి నిరాకరించగా టింబరు మర్చంట్లు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో "రిట్" వేశారు

జస్టిస్ చిన్నపరెడ్డి ఉభయవాదనలు విని కలపవర్తకులకు లైసెన్సులను ఇవ్వవలెనని గుంటూరు మునిసిపాలిటీని ఆదేశించారు.

## శ్రీ ఉపేంద్రగుప్తకు సన్మాన సన్నాహాలు

చీరాల, నవంబరు 15—స్థానిక పంచాయతీ అధ్యక్షులు, మునిసిపల్ కౌన్సిలు సభ్యులనేకాక ఇంకా అనేక ప్రజాహిత కార్యక్రమాలలో సంబంధంకలిగి సేవచేసిన వర్తకప్రముఖులు శ్రీ పూడూరి ఉపేంద్రగుప్తను సన్మానించడానికి మొన్న ఇక్కడ జరిగిన సమావేశంలో మునిసిపల్ కౌన్సిలరు శ్రీ చు. దూరి ఓబయ్య అధ్యక్షులుగా శ్రీ కొత్త వెంకయ్య కార్యదర్శిగా ఆహ్వాన సంఘం ఎన్నుకొనబడ్డారు.

## ఆకాశవాణి

### ఆదివారం నవంబర్ 17

#### విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6.00 వందేమాతరం, సుప్రభాతం 6.10 భక్తిరంజని, 6.40 ఆంగ్లంలో వార్తలు, 6.45 సూక్తిముక్తావళి, 6.50 పొలంపనులు 7.00 తెలుగులో వార్తలు, 7.15 సంగీత శిక్షణ, 7.30 అమరవాణి, 8.00 ఆంగ్లంలో వార్తలు, 8.30 బొమ్మరిల్లు, మ॥ 12.30 కార్మికుల కార్యక్రమం, 1.00 యువవాణి 1.30 ఆంగ్లంలో వార్తలు, 1.50 తెలుగులో వార్తలు, 3.00 పెద్దక్కయ్య, చిత్రం సా॥ 5.55 స్థానిక ప్రకటనలు, 6.00 ఆంగ్లంలో వార్తలు, 6.05 ప్రాంతీయ వార్తలు, 6.15 గాంధీకీర్తనావళి 6.45 సమస్యాపూరణం 7.00 తెలుగులో వార్తలు, 7.15 వంటనీమలు, 8.15 చిత్రతరంగిణి 9.00 ఆంగ్లంలో వార్తలు, 9.15 ఢిల్లీనుంచి కిళ్ళీ, 10.30 ఆంగ్లంలో వార్తలు, 10.35 జనగణమన, ప్రసార సమాప్తి.

#### హైదరాబాద్—ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6.30 వందేమాతరం, 6.40 ఆంగ్లంలో వార్తలు, 6.45 భక్తిరంజని, 7.00 తెలుగులో వార్తలు, 7.15 సంగీత శిక్షణ, 7.30 అమరవాణి, 7.45 స్తుతిమాల, 7.55 సూక్తిముక్తావళి, 8.00 ఆంగ్లంలో వార్తలు, మ॥ 12.30 కార్మికుల కార్యక్రమం, 1.00 రంగవల్లి, 1.30 ఆంగ్లంలో వార్తలు, 1.40 చిత్రసీమ, 1.50 తెలుగులో వార్తలు, 2.00 చిత్రసీమ, 2.15 బాలవినోదం, 3.00 పెద్దక్కయ్య చిత్రం, సా॥ 5.55 స్థానిక ప్రకటనలు, 6.00 ఆంగ్లంలో వార్తలు, 6.05 ప్రాంతీయ వార్తలు, 6.25 ముఖ్యప్రకటనలు, విరామసంగీతం, 6.30 వ్యావసాయిక విషయాలు, 7.00 తెలుగులో వార్తలు, 7.15 వెలుగుబాట, 7.30 చిత్రసీమ 8.25 ఈ మానవుపాట, 8.30 పాటలు, 9.00 ఆంగ్లంలో వార్తలు, 9.15 ఢిల్లీనుంచి కిళ్ళీ, 11.30 ఆంగ్లంలో వార్తలు, 11.40 జనగణమన ప్రసార సమాప్తి.

#### హైదరాబాద్—బి

మ॥ 2.00 చిత్రవళి, 2.10 ఉర్దూలో వార్తలు, 2.20 సుగంధసంగీత, 2.30 బచ్చోంకేలియే, సా॥ 9.00 చిత్రవళి, 9.15 ఉర్దూలో వార్తలు, 9.30 ఉర్దూలో కార్యక్రమం, 10.30 జనగణమన ప్రసార సమాప్తి

#### మద్రాసు—ఎ

406.7 మీ (720 కిలోసై)

ఉ॥ 6.00 వందేమాతరం, మంగళగానం, 6.30 నేటి కార్యక్రమ వివరణ, 6.40 ఆంగ్లంలో వార్తలు, 6.50 వాద్యసంగీతం, 7.30 చిత్రగానం, 8.00 మెల్లిసై, 10.30 హిందూస్థానీ సంగీతం, 10.45 ఆంగ్లంలో వార్తలు, మ॥ 12.00 కె. మంగళం, 12.30 సూర్యకాంతి, 1.30 వాద్యగోష్ఠి, 1.45 చిత్రగాత్రం, 3.00 మీదుకోరిన పాటలు, 3.30 నాటిక, సా॥ 5.30 చిత్రగానం 6.15 కార్యక్రమ వివరణ, 6.30 విరామసంగీతం 6.45 చిత్రగానం, 7.30 వ్యవసాయదారులకు, 8.15 రేడియో న్యూస్ రీల్, 9.00 ఆంగ్లంలో వార్తలు, 9.15 ప్రసంగం 11.00 జనగణమన ప్రసారసమాప్తి.

#### మద్రాసు—బి

211.3 మీ (1420 కిలోసై)

ఉ॥ 6.57 వందేమాతరం, మంగళధ్వని 7.00 తెలుగులో వార్తలు, 7.30 మద్రాసు ఎ వరె. 8.00 ఆంగ్లంలో వార్తలు, 8.15 మద్రాస్ ఎ వరె. 8.45 అటవీయువ, 9.30 కళారంగం. మ॥ 1.30 ఆంగ్లంలో వార్తలు 1.50 తెలుగులో వార్తలు, 2.00 నాటికలు, సా॥ 6.00 ఆంగ్లంలో వార్తలు, 6.05 మద్రాసు ఎ వరె. 7.00 తెలుగులో వార్తలు, 7.30 గీతమాలిక, 8.00 మద్రాసు ఎ వరె 8.45 ఇతర ప్రాంత సంగీతం, 9.00 ఆంగ్లములో వార్తలు, 9.15 ఢిల్లీనుంచి కిళ్ళీ, 10.35 జనగణమన ప్రసార సమాప్తి.


తేలికైన నెలవారీ వాయిదాలు!

సికిందరాబాద్‌లో గాని, హైదరాబాద్‌లో గాని ఇల్లు లేక ఇళ్ళ స్థలాన్ని గాని కొనదలచారా?

లేకపోతే మా కాలనీలో ఎక్కడైనా ఇల్లు కట్టుకోవాలను కుంటున్నారా?

మా "ఉభయతారక పథకం"లో చేరడానికి త్వరపడండి.

వివరాలు కావాలంటే లీడింగ్ కాలనైజర్లను అడగండి!

ఛెమిండ్ ఎంటర్ ప్రయిజెస్ (రిజిష్టర్డ్), లేక

ఇంటిగ్రేటెడ్ ఇన్వెస్టిమెంట్స్ & చిట్ ఫండ్స్ (ప్రయివేట్) లిమిటెడ్,

37, లాల్‌బహదూర్ స్టేడియం, హైదరాబాద్-1

వారినైనా సంప్రతించండి.

ఫోన్: 34322 Grams: COLONIZERS.



సన్‌లైట్ వల్ల ప్రతిమాటూ మీ బట్టలు అతికాంతిగా ఉతుకబడును

సన్‌లైట్ సబ్బును వాడండి, మరి మీరు చూసేదేమనగా...అది సరియైన కాంతిగా ఉతుకుతుంది. సన్‌లైట్ సబ్బువల్ల నిలంగా, ఉతుకుతుకునతూ మీ బట్టలు అతి కాంతిగా వుంటాయి! సన్‌లైట్ సబ్బుమ కొద్దిగా దుద్దితే చాలు మురికలకొలదీ సురగ వస్తుంది, ఆ సురగయే మీ బట్టలను ఎంతోళుభ్రంగాను...ఎంతో కాంతిగాను వుంచుతుంది. మీ బట్టలు అన్నిటినీ సన్‌లైట్ సబ్బుతో ఉతకండి

మీరు రోజూ ఉపయోగించే బట్టలను సన్‌లైట్‌తో ఉతకండి

# క్రీడాభిరామం

## దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో విప్లవ స్థావరాలు

### నెలకొల్పాలని నక్సల్‌బారీ వాదుల సంకల్పం

హైదరాబాద్, నవంబర్ 15 — దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో విప్లవ స్థావరాలను నెలకొల్పవలసిందిగా నక్సల్‌బారీ వాదులుగా పేరుగాంచిన ఉగ్రవాద కమ్యూనిస్టులు ఆదేశించినట్టు తెలుస్తున్నది.

మావో సిద్ధాంతాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడమే తమ "ప్రధాన కార్యక్రమం"గా వ్యవహరించాలని ఇటీవల జరిగిన అఖిలభారత సమన్వయ సంఘం సమావేశంలో సభ్యులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

ప్రజల ఉద్యమాన్ని హింసాయుత ధోరణిలో ఒకవైపున అణచివేస్తూ, వేరొక వైపున ఎన్నికలు, మంత్రివర్గాలు, మన్నగు వాటిద్వారా ప్రజా చైతన్యాన్ని అణచివేస్తూ, రెండువిధాలా అభివృద్ధి నిరోధక శక్తులుగా వ్యవహరిస్తున్నవని ఆరోపిస్తూ ఒక తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

తమ "అమెరికా, సోవియెట్"ల ఆ దేశం మేరకు ఇట్టి కుయుక్తులను ప్రభుత్వం అవలంబిస్తున్నదని వారు ఆరోపించారు.

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లతోకూడా నక్సల్‌బారీ సందేశం వ్యాప్తి చెందడంవల్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు.

మావో సిద్ధాంతాలను అనుసరిస్తున్న విప్లవపార్టీ కార్యకర్తలు ప్రజలు క్రమేపీ "అమెరికన్, సోవియెట్" గుత్త పెట్టుబడిదారులను అంతమొందించగలరన్న ప్రగాఢ గలదని ఆరోగ్య మంత్రి శ్రీ వి. వెల్లింగ్టన్ విశ్వాసాన్ని ఉగ్రవాదులు వ్యక్తం చేశారు, హామీ నిచ్చారు.

## నూతన ఇరాన్ రాయబారి

### రాష్ట్రపతికి అధికార పత్రాల సమర్పణ

న్యూఢిల్లీ, నవంబరు 15 — భారతదేశంలో నూతన ఇరాన్ రాయబారి శ్రీ మహమ్మద్ రెజా అమర్ — షెమీరాన్ రాష్ట్రపతి భవన్‌లో మొన్న ఉదయం రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్‌ను కలుసుకొని తన అధికార నియామక పత్రాలను సమర్పించారు.

ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కళలు, తత్వశాస్త్రం, ఆలోచనా ధోరణి ఇరాన్ ప్రజల ఆలోచనను, జీవితాన్ని ఎంతో సుసంపన్నం చేశాయని, ఇండియా-ఇరాన్‌ల మాదిరిగా దీర్ఘకాలం చారిత్రక సంబంధాలు కలిగిన దేశాలు ప్రపంచంలో ఏ రెండు దేశాలు లేవని ఆయన చెప్పారు.

ఉభయ దేశాలమధ్య వాణిజ్య, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో పెరుగుతున్న సహకారంవల్ల ఆయన తన సంతృప్తిని ప్రకటించారు.

నూతన రాయబారికి స్వాగతం చెబుతూ రాష్ట్రపతి, ఉభయ దేశాల మధ్య పెరుగుతున్న సహకారం, ఉభయదేశాల సంబంధాలు మరింత బలపడడానికి దారి తీస్తున్నాయని చెప్పారు. ఇరాన్ సాధిస్తున్న అభివృద్ధిని తాము గమనిస్తున్నామని, ఇరాన్ రాజు తమ దేశంలో స్వాగతం ఇవ్వడానికి ఎదురు చూస్తున్నామని చెప్పారు.

---

ఆయుర్వేద వైద్య విధాన వ్యాప్తికి కేరళ ప్రభుత్వం సాధ్యమైన కృషి చేయగలదని ఆరోగ్య మంత్రి శ్రీ వి. వెల్లింగ్టన్ విశ్వాసాన్ని ఉగ్రవాదులు వ్యక్తం చేశారు, హామీ నిచ్చారు.

## దక్షిణ మండలం రంజీట్రోఫీ

# ఇన్నింగ్స్ 187 పరుగులతో కేరళపై హైద్రాబాద్ గెలుపు

హైదరాబాద్, నవంబర్ 15 —

మొన్నటి నుంచి ఇక్కడ జరుగుతున్న దక్షిణ మండలం రంజీట్రోఫీ పోటీలో నేడు కేరళ జట్టు 92 పరుగులకే ఆలౌట్ అయి, అసలు పోటీలోనే ఓడిపోయింది.

హైదరాబాద్, కేరళ జట్టుల మధ్య మొన్నటి నుంచి జరుగుతున్న పోటీ నేడు అట ప్రారంభమైన 45 నిమిషాలకే ముగిసింది. నిన్న ఆట ముగిసే సమయానికి ఆయిదు వికెట్లు నష్టానికి 73 పరుగులు చేసిన కేరళ జట్టు నేడు 45 నిమిషాలలో మిగిలిన వికెట్లను 19 పరుగులకే కోల్పోయింది.

స్కోరు వివరం : కేరళ 144 మొదటి ఇన్నింగ్స్‌లో రెండవ ఇన్నింగ్స్‌లో 92.

హైదరాబాద్ జట్టు మూడు వికెట్లకు 423 పరుగులు చేసి డిక్లేర్ చేసింది.

అంటే హైదరాబాద్ జట్టు ఒక ఇన్నింగ్స్ 187 పరుగులతో కేరళను జయించిందన్న మాట.

## అఖిల భారత క్రీడామండలి అధ్యక్షులుగా శ్రీ భగవత్‌ఝా అజాద్ ఎన్నిక

న్యూఢిల్లీ, నవంబర్ 15 — నేడు తిరిగి అఖిల భారత క్రీడామండలి కార్యవర్గం ఎన్నుకొనబడింది.

కేంద్ర విద్యాశాఖ స్టేట్ మంత్రి శ్రీ భగవత్‌ఝా అజాద్ అధ్యక్షుడుగా ఎన్నికైనారు.

## ఎమ్. సి. సి. పర్యటన

### ప్రధాని సహాయానికి శ్రీ ఇరాని విజ్ఞప్తి

మద్రాసు, నవంబరు 14 — ఈ గీతా కాలంలో ఇండియాలో ఎం.సి.సి. జట్టు పర్యటించడానికి కావలసిన విదేశీ మారక ద్రవ్యం మంజూరుకై ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచన జరిపి ద్రవ్యాన్ని విడుదల చేయించవలసిందిగా ప్రధాని మంత్రి శ్రీమతి ఇందిరాగాంధిని క్రికెట్ కంట్రోల్ బోర్డు అధ్యక్షులు శ్రీ జడ్. ఆర్. ఇరాని నేడు విజ్ఞప్తి చేశారు.

ఇరవైవేల పౌండ్ల విదేశీ మారక ద్రవ్యాన్ని మంజూరు చేయలేమని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని కంట్రోల్ బోర్డుకు నిన్న తెలియపరచింది.

### శ్రీ చిన్నస్వామి వ్యాఖ్య

బెంగుళూరు, నవంబర్ 15 — ఈ గీతా కాలంలో ఇండియాలో ఎం. సి. సి. జట్టు పర్యటించడానికి కావలసిన విదేశీమారక ద్రవ్యాన్ని మంజూరు చేయవలసిందిగా ఇండియన్ క్రికెట్ కంట్రోల్ బోర్డు విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడంపై కంట్రోల్ బోర్డు ఉపాధ్యక్షులు శ్రీ ఎమ్. చిన్నస్వామి వ్యాఖ్యానిస్తూ 'చాలా దురదృష్టకరం. ఇటు దేశంలోను, అటు విదేశాలలోను మన క్రికెట్ ప్రతిష్ఠకు భంగకరం' అని అన్నారు.

## ఇంటర్ యూనివర్శిటీ కుస్తీ పోటీలు ప్రారంభం

### కురుక్షేత్రలో

కురుక్షేత్ర, నవంబర్ 15 — నేటి నుంచి ప్రారంభమైన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయ కుస్తీ పోటీలలో 26 జట్లు పాల్గొంటున్నాయి.

ఈ పోటీలు అయిదురోజులపాటు జరుగుతాయి.

## ఇంటర్ యూనివర్శిటీ మహిళల టెన్నిస్ పోటీలు

### విశాఖపట్టణంలో డిసెంబరు 22 నుంచి జనవరి 9 వరకు

విశాఖపట్టణం, నవంబరు 15 — అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం మహిళల టెన్నిస్ పోటీలు డిసెంబరు 22 నుంచి జనవరి 9 వరకు ఇక్కడ జరుగుతాయి.

ఢిల్లీ, పంజాబ్, పూనా, కురుక్షేత్ర, బెంగుళూరు, మైసూర్, మద్రాసు, తిరుపతి, ఆంధ్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయాల నుంచి ఈ పోటీకి జట్లు వస్తాయి.

## నేట్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు వాయిదా

గుంటూరు, నవంబర్ 15 — నవంబరు 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఇగ్గయ్యపేటలో జరుగనున్న నేట్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్, నేట్ వాలీబాల్ జట్టు ఎన్నికలు వాయిదా వేయబడినవని ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వై. పి. కృష్ణారావునాయుడు తెలియజేస్తున్నారు.

పోటీలో పాల్గొనే జట్లకు సవరణ తేదీలు తరువాత తెలియజేయబడతాయి.

## మిల్లులకు టన్ను చెరకు రు. 80 లకు సప్లయికి సంసిద్ధత

### రిజిష్టరు కాని ఉత్పత్తిదారుల సంఘం ప్రకటన

హైదరాబాద్, నవంబరు 15 — టన్ను చెరకును రు. 80 లకు అమ్మడానికి రిజిష్టరు కాని ఆంధ్రప్రదేశ్ చెరకు ఉత్పత్తిదారుల సంఘం సిద్ధమని తన సంసిద్ధతను వ్యక్తపరచింది.

రాష్ట్రంలోని చెరకు ఉత్పత్తిదారులలో 30 శాతం మంది మాత్రమే సంఘంగా ఏర్పడి రిజిష్టరు చేయించుకున్నారని, తక్కిన 70 శాతం మంది తమ సంఘంలో వున్నారని సంఘం ప్రకటించింది. రిజిష్టర్డు చెరకు ఉత్పత్తి దారులు చెరకును సప్లయి చేయడానికి ఏర్పరిచిన పథకంలో తాము చెరకు సప్లయి చేయడానికి సంసిద్ధంగా వున్నామని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## గాంధీజీ రచనలు

### రాష్ట్రపతికి బహూకరణ

న్యూఢిల్లీ, నవంబర్ 15 — నవజీవన్ ట్రస్టు ప్రచురించిన మహాత్మాగాంధి రచనల తొలి సెటును నిన్న లాంఛనంగా రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్‌కు బహూకరించారు.

ఆరు సంపుటాలుగా ప్రచురించిన ఈ గ్రంథాలను ఆ ట్రస్టు చైర్మన్ శ్రీమన్నారాయణ్ నిన్న రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతికి సమర్పించారు.

మహాత్మా గాంధి శతజయంత్యుత్సవాల సందర్భంలో ఈ గ్రంథాలను ప్రత్యేకంగా ప్రచురించారు.

## లోకసభ గౌరవ ప్రతిష్ఠల పరిరక్షణ చర్యలు

### సాధారణ వ్యవహారాల సంఘం పరిశీలన

న్యూఢిల్లీ, నవంబర్ 15 — మొన్న లోకసభలో జరిగిన గందరగోళం సందర్భంలో స్పీకర్ లేదా సభ్యులు లేదా పార్లమెంటు హక్కులను గౌరవించక పోవడం విచారకరమని ఆచార్య జె. బి. కృపలానీ నిన్న లోకసభలో అన్నారు. నిన్నటి గందరగోళం ప్రతిధ్వని నిన్న కూడా వినవచ్చింది.

ప్రధాని వాడిన ఎదంపై ప్రతిపక్షం సభ్యులు ఓర్మిని కోల్పోయారని అయితే అధికార పక్షంపై అంతకంటే మరింత తీవ్రమైన ఎదజాలాన్ని ప్రతిపక్షసభ్యులు తరచు వాడడం జరుగుతున్నదని ఆయన అన్నారు.

అయితే ఈ విషయం ఇక వివరంగా ప్రస్తావించవలదని స్పీకర్ ఆచార్య కృపలానీని కోరారు. నేడు పార్లమెంటు సాధారణ వ్యవహారాల సంఘం సమావేశం జరుగనున్నదని, ఆ సమావేశంలో సభ గౌరవాన్ని పరిరక్షించేందుకు కొన్ని నిర్ణయాలను గైకొనడం జరగగలదని స్పీకర్ అన్నారు.

ఆచార్య కృపలానీ మాట్లాడేసందర్భంలో కొందరు ప్రతిపక్ష సభ్యులు అంతరాయం కలిగించారు.

"మంత్రి మాట తప్పవచ్చు. మీరు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు" అని శ్రీ వాసుదేవన్ నాయర్ అన్నారు.

కామన్స్ సభలో బ్రిటిష్ ప్రధానిని పెక్కు పర్యాయాలు సభ్యులు కేకలువేసి, ప్రసంగించకుండా చేశారని జార్జి పెర్నాండెజ్ అన్నారు.

సభనుంచి బయటికి వెళ్ళిన తరువాత కూడా కృపలానీతో శ్రీ వాసుదేవ నాయర్, జార్జి పెర్నాండెజ్‌లు తీవ్ర వాగ్వివాదానికి దిగారు.

## శ్రీమతి గీతాబాగ్చీ విడుదల సమస్య

న్యూఢిల్లీ, నవంబరు 15 — లోకసభలో సి.ఎస్.పి. సభ్యుడు శ్రీ సమర్‌గుహ మొన్న ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధిని కలుసుకొని, శ్రీమతి గీతాబాగ్చీని తిరిగి స్వదేశం తీసుకొచ్చే చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు. పశ్చిమ బెంగాల్‌లో యిటీవల వచ్చిన వరదలలో శ్రీమతి గీతాబాగ్చీ తూర్పు పాకిస్తాన్‌లోకి కొట్టుకు పోయింది. ఆమె సజీవంగా వున్నట్టు తెలుస్తున్నది.

# విపణీవీధి

విజయవాడ, నవంబర్ 15 —

### బులియన్ మార్కెట్

| | |
|---|---|
| వెండి 1 కిలోగ్రాము | 572.00 |
| 10 గ్రాములు | 5.80 |

### కొబ్బరికాయలు (1000)

| | |
|---|---|
| విజయవాడలో | 380.00 |
| పాలకొల్లులో | 360.00 |
| అమలాపురంలో | 340.00 |

### ధాన్యం (కొత్తవి)

| | | |
|---|---|---|
| అక్కుట్లు | 100 కి.గ్రా. | — |
| | | నెంబర్లు |

### బియ్యం (కొత్తవి)

| | |
|---|---|
| అక్కుట్లు | 103.00 |
| నెంబర్లు | 120.00 |

### అపరాలు

| | |
|---|---|
| కందులు | 100.00 |
| మినుములు | 105.0 |
| పెసలు | 100.00 |
| శనగలు | 93.00 |
| వేడుశనగ కాయ | 95 60 |
| వేడుశనగ నూనె | 340.30 |

### హైదరాబాద్ ధరవరలు

హైదరాబాద్, నవంబర్ 15 —

శ్రీ కె. జయప్రకాష్ రావు అండ్ కో వారి వద్ద నేటి ధరవరలు ఈ విధంగా ఉన్నాయి. ఫోన్ : నెం. (43989)

(ధరలు 100 కె. జి. లకు)

| | |
|---|---|
| దప్తి జొన్నలు | 58.00 66.00 |
| తెల్లజొన్నలు | 90.00 100.00 |
| పచ్చ జొన్నలు | 60.00 68.00 |
| ఎర్రపు | 310.00 415.00 |
| కందులు | 105.00 115.00 |
| చిన్న కందులు | 80.00 90.00 |
| ఎర్ర కందులు | 85 00 100.00 |








పాపులర్ షూ మార్టు

H. O. విజయవాడ-3

కృష్ణా పుష్కర సందర్భమున మేము ప్రకటించిన రీతిగా ది 13-11-68 సాయంత్రం 4 గంటలకు డాక్టరు టి. వి. ఎస్. చలపతిరావు M.L.A. గారి ఆధ్వర్యమున లాటరీ ద్రాతీయబడినది. 24-11-68 ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆఫీసులో బహుమతులు అందజేయబడును.

బహుమతులు పొందిన వారు :—

1 సైకిల్ : ఎస్. నరశింహారావు, తుమ్మగూడెం, నూజివీడు తాలూకా.

రెండు ట్రాన్సిస్టర్స్ : (1) వి. ధర్మారావు, కొత్తపాలెం, దివి తాలూకా; (2) పి. రామారావు, విజయవాడ; మూడువాచీలు : (1) ఎం. ఉత్తరయ్య, గోగినపల్లి, బమ్మం తాలూకా; (2) వి. వెంకట రత్నం, ఉండి, భీమవరం తాలూకా; (3) కె. బసన్న, లంకాసాగర్ ప్రాజెక్టు, అడవర్లపాడు; నాలుగు కుర్చీలు : (1) వి. కామాక్షమ్మ, పొత్తపి, రాంపేట తాలూకా; (2) డి. రామయ్య, చెవుటిగల్లు, నందిగామ తాలూకా. (3) పి. మోహనరావు, వత్సలత; విజయవాడ. (4) ఎస్. సుబ్రహ్మణ్యం, ఆంధ్రపత్రిక; విజయవాడ. అయిదు పైలట్ పెన్నులు: (1) ఎం. రామకృష్ణారెడ్డి, తేళ్ళపోలు. (కృష్ణా) (2) టి. రాంప్రసాద్, బందరు. (3) ఎ. రాఘవరావు, పట్టినగర్, విజయవాడ. (4) పి. వి. నరసింహారావు, విజయవాడ—1. (5) కె. వెంకటేశ్వర్లు, విజయవాడ—1.

Bata DIP Walkmaster

రాటికీ, పోటీకీ నిల్చి ఎంతో సదుపాయంగా ఉంటాయి

డైరెక్ట్ ఇంజక్షన్ పద్ధతిని పై భాగాన్ని సోలుకు అతికించారు. తోళ్లు బాగా మన్నుతాయి. మేకులు లేవు. కుట్లులేవు. డిఐపి సోలింగుతో వూడిపోవడం, ఒదులు అవడం వుండదు. వాటర్‌ప్రూఫ్. బరువే వుండవు. మృదువుగా వుంటాయి. 9 నెలలు గ్యారంటీ. బాటా డిఐపి రాటికీ పోటికీ నిల్చి సదుపాయంగా వుండేలా చేసారు. అసలు మోడల్‌ను మామూలు పరిస్థితుల్లో లాగి చూచి తగిన మార్పులుచేసి మరీ తయారుచేయడానికి పంపుతారు. వీటితో నడుస్తుంటే హాయి. సదుపాయం తక్కిన తోళ్లలో వుండదు.

సైజ్ 31 — 34.95



Bata

సైజ్ 32 — 34.95


Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd, Vijayawada-2
Editor: Narla Venkateswara Rao,